


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

సంపుటి: 5 సంచిక: 154, పేజీలు - 08

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక


బుధవారం, నవంబర్ 12, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## భారత్‌కు భారీ భూకంపాల ముప్పు

- భూమి కింద చీలిపోతున్న టెక్టోనిక్ ప్లేట్
- మరింత పెరుగుతున్న హిమాలయాలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పైకి భూమి శాంతంగానే కనిపిస్తున్నా భూగర్భంలో మాత్రం అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాటి కారణంగానే అప్పుడప్పుడూ భూకంపాలు సంభవిస్తూ ఉంటాయి. ఇలాంటి భూకంపాలను ముందుగా గుర్తించేందుకు భూగర్భ శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు చేస్తూ ఉంటారు. సాధారణంగా భూమి కింద ఉండే టెక్టోనిక్ ప్లేట్లు ఢీకొనడం వల్ల భూకంపాలు సంభవిస్తుంటాయి. ఇక సముద్రం కింద ఇలాంటివి జరిగినపుడు సునామీలు ఏర్పడతాయి. భూమి ఏర్పడిన మొదట్లో ఈ టెక్టోనిక్ ప్లేట్లు ఢీకొనడం వల్లే పర్వతశ్రేణులు ఏర్పడ్డాయి. అయితే ప్రస్తుతం భారత టెక్టోనిక్ ప్లేట్లు చీలిపోతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటి కారణంగా భారత్

2లో..

## ఎవరి లెక్కలు వారివే

- ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్
- క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అవకాశం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల పోలింగ్ ముగిసింది. అత్యల్పంగా పోలింగ్ శాతం నమోదయింది. సాయంత్రం ఐదు గంటలకు 47 శాతం మాత్రమే పోలింగ్ నమోదయింది. అయితే పోలింగ్ శాతం తక్కువగా నమోదవ్వడం ఎవరికి లాభమన్న చర్చ రాజకీయ పార్టీల్లో జరుగుతుంది. తక్కువ పోలింగ్ శాతం నమోదయితే అది అధికారంలో ఉన్న పార్టీకి ప్రయోజనమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంటే పెద్దయెత్తున పోలింగ్ శాతం నమోదయ్యేదని చెబుతున్నారు. బీఆర్ఎస్ కూడా పోలింగ్ శాతం ఎక్కువ కావడానికి చివరి నిమిషం వరకూ ప్రయత్నించింది. ప్రధానంగా బస్తీల్లో ఓటర్లను ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు రప్పించాలని చూసింది. కానీ పోలింగ్ శాతం పెరగకపోవడంతోబీఆర్ఎస్ కూడా కొంత నిస్తేజంలో పడినట్లు కనిపిస్తుంది.

### కాంగ్రెస్ కూడా అత్యధికంగా..

మరొకవైపు కాంగ్రెస్ పార్టీ కూడా అత్యధిక సంఖ్యలో ఓట్లు నమోదు చేయించాలని భావించింది. చిత్ర పరిశ్రమకు చెందిన కార్మికులతో పాటు బస్తీ వాసులను పెద్దయ సంఖ్యలో పోలింగ్ కేంద్రానికి తీసుకు వచ్చి తమకు అనుకూలంగా ఫలితాన్ని మలచుకోవాలని భావించింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కూడా ఉదయం మీడియాతో మాట్లాడుతూ అరవై శాతం పోలింగ్ జరుగుతుందని చెప్పడం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ కూడా అధిక శాతం పోలింగ్ పైనే ఆశలు పెట్టుకున్నట్లు అర్థమవుతుంది. కానీ తీరా చూస్తే తక్కువ శాతం పోలింగ్ నమోదవ్వడంతో కాంగ్రెస్ నేతల్లో కూడా ఒకరకమైన చర్చ మొదలవుతుంది. వివిధ సామాజికవర్గాలతోనూ, చిత్ర పరిశ్రమ కార్మికులతోనూ ముఖ్యమంత్రి సమావేశమవ్వడంతో పోలింగ్ శాతం పెరుగుతుందని కాంగ్రెస్ కూడా భావించింది.

### బీజేపీ మాత్రం..

ఇక బీజేపీ ఈ విషయంలో పెద్దగా ఆశలు లేకుండా బరిలోకి దిగింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం జూబ్లీహిల్స్ ఉప నియోజకవర్గం ఉప ఎన్నిక ఒక చిన్న ఎన్నిక అని కొట్టిపారేయడం కూడా పార్టీలో చర్చకు దారి తీసింది. బీజేపీ తాము గెలవకపోయినా మరొకరి గెలుపోటములపై కీలకంగా మారనుందని తొలి నుంచి అంచనాలు వినిపించిన నేపథ్యంలో తక్కు పోలింగ్ శాతం నమోదు కావడంతో మూడు ప్రధాన పార్టీలు ఎవరికి వారు తమకు అనుకూలంగా ఫలితం ఉంటుందని భావిస్తున్నారు. వివిధ సర్వేలు ఒక పార్టీకి అనుకూలంగా వస్తుందని చెప్పడంతో పోలింగ్ కేంద్రాలకు రాకుండా అడ్డుకున్నారని రాజకీయ పార్టీ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. కానీ ఓటర్ల మనసులో ఏముందన్నది ఈ నెల 14వ తేదీ కౌంటింగ్ తర్వాత తెలియనుంది.

## బిహార్‌లో ఎన్డీఏకే ఓటేసిన ఎగ్జిట్ పోల్స్

మహాఘట్‌బంధన్‌కు ఇక ప్రతిపక్షమేనా.?




**పాట్నా (ప్రశ్న న్యూస్)** బీహార్ అసెంబ్లీకి ఈ నెలలో రెండు విడతలుగా జరిగిన ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో అధికార ఎన్డీయేతో విపక్ష మహాకూటమి హోరాహోరీగా తలపడింది. మధ్యలో ప్రశాంత్ కిషోర్ పార్టీ జన్ సురాజ్ కూడా అదృష్టం పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగింది. వీరితో పాటు అసదుద్దీన్ ఓవైసీ నేతృత్వంలోని ఎంఐఎంతో పాటు ఇతర చిన్న పార్టీలు కూడా పోటీ పడ్డాయి. దీంతో ఈసారి ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. దీనికి ముగింపు పలుకుతూ పలు ఎగ్జిట్ పోల్ సంస్థలు ఫలితాలు ప్రకటించాయి. ఇందులో దాదాపుగా అన్ని ఎగ్జిట్ పోల్ సంస్థలు ఏకపక్షంగా ఎన్డీయేకు విజయాన్ని కట్టబెట్టాయి. అదీ సాధారణ మెజార్టీతో పాటు భారీ మెజార్టీతో ఎన్డీయే గెలువబోతోందని అన్ని ఎగ్జిట్ పోల్ సంస్థలు వెల్లడించాయి. అలాగే విపక్ష మహాకూటమి మరోసారి

2లో..

## ఆలోచనతో రండి.. పారిశ్రామికవేత్తలు కండి

- సీఎం చంద్రబాబు పిలుపు

- కనిగిరిలో ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- సీఐఐ సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే టార్గెట్
- గత పాలనలో పరిశ్రమలు రాష్ట్రం విడిచి పారిపోయాయన్న సీఎం
- 2026 నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** యువత మంచి ఆలోచనలతో ముందుకు వస్తే, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యత తమదని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 175 నియోజకవర్గాల్లో 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసి, లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తామని ఆయన ప్రకటించారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెదఈర్లపాడులో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును మంగళవారం ఆయన ప్రారంభించారు.

2లో..

## వ్యక్తిగతంగా హాజరవుతా.. వారం గడువు ఇవ్వండి

- సీబీఐ కోర్టును కోరిన జగన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సీబీఐ కోర్టులో వ్యక్తిగత హాజరు మినహాయింపు పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఈ నెల 21వ తేదీలోపు వ్యక్తిగా హాజరవుతానని కోర్టుకు తెలిపారు. యూరప్ పర్యటనకు వెళ్లాలనే ఉద్దేశంతో హైదరాబాద్

2లో..

## అందెశ్రీ కుటుంబానికి అండగా రాష్ట్ర ప్రభుత్వం

- ముగిసిన అందెశ్రీ అంత్యక్రియలు
- అందెశ్రీ పాడె మోసిన రేవంత్ రెడ్డి
- పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రాన్ని కోరతామన్న సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఉద్యమానికి తన పాటతో ప్రాణం పోసిన దిగ్గజ కవి, రచయిత అందెశ్రీ మరణం రాష్ట్రానికి తీరని లోటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన అందెశ్రీ అంత్యక్రియలు మంగళవారం ఘట్ కేసర్‌లోని ఆయన స్వగ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఈ అంతిమయాత్రలో పాల్గొని పాడె మోసి ఆయనకు కన్నీటి వీడ్కోలు పలకడం అందరి హృదయాలను కదిలించింది. మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

2లో..

## దేశంలోనే తెలంగాణ నంబర్ వన్

- జల్ సంచయ్ జన్ భాగీదారిలో ఈ ఘనత



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జల్ సంచయ్ జన్ భాగీదారి 1.0 కార్యక్రమంలో తెలంగాణ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిందని జల్ శక్తి మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 5.2 లక్షల జల సంరక్షణ నిర్మాణాలు చేపట్టి తెలంగాణ ఈ ఘనత సాధించింది. ఛత్తీస్ గఢ్, రాజస్థాన్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఛత్తీస్‌గఢ్- 4.05, రాజస్థాన్ 3.64 లక్షల జల సంరక్షణ నిర్మాణాలతో రెండు, మూడు స్థానంలో ఉన్నాయి. ఈ ఏడాది "జల్ శక్తి అభియాన్: క్యాచ్ ది రైన్" ప్రచారంలో భాగంగా అవార్డులను కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ఈ అవార్డులను ప్రకటించారు. నవంబర్ 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, జల వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు ఆధ్వర్యంలో జరిగే 6వ జాతీయ జల అవార్డుల ప్రదానోత్సవంలో విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఢిల్లీలో ఈ కార్యక్రమం ఏర్పాటు కానుంది. గత ఏడాది సెప్టెంబర్ లో జల్ సంచయ్ జన్ భాగీదారి కార్యక్రమాన్ని ప్రారంభించింది కేంద్ర ప్రభుత్వం. సామాజిక-ఆధారిత జల నిర్వహణను ప్రోత్సహించడం

2లో..

## ప్రతి ఉగ్రవాదినీ వేటాడండి

- అధికారులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చిన అమిత్ షా

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఎర్ర కోట సమీపంలో జరిగిన భారీ పేలుడుతో దేశ రాజధాని ఢిల్లీ ఉలిక్కిపడింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ఉన్నతస్థాయి భద్రతా సమావేశం జరిగింది. ఢిల్లీ కారు పేలుడుపై వెనుక ఉన్న ప్రతి కుట్రదారుడినీ వేటాడాలని అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు. పేలుడుకు కారణమైన ప్రతి ఒక్కరూ భద్రతా సంస్థల పూర్తి ఆగ్రహాన్ని ఎదుర్కొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్,

2లో..



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టుల మృతి



బస్తర్ (ప్రశ్న న్యూస్) ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో మంగళవారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఆపరేషన్ మావోయిస్టుల కార్యకలాపాలను అణచివేయడంలో కీలక ముందడుగు అని పోలీసు అధికారులు వెల్లడించారు. పక్కా నిఘా సమాచారంతో ఈ ఆపరేషన్ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బీజాపూర్, దంతెవాడ జిల్లాల డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బృందాలు సంయుక్తంగా అడవుల్లోకి వెళ్లాయి. ఉదయం 10 గంటల సమయంలో భద్రతా బలగాలను గమనించిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా, బలగాలు దీటుగా

2లో..

## వైట్ కోట్ టెర్రర్

- వైద్య ముసుగులో ఉగ్ర కుట్ర




8లో..

## ప్రజలంతా నవీన్ వైపు నిలిచారు

- నవీన్ యాదవ్ కు భారీ మెజారిటీ ఖాయమన్న టీపీసీసీ చీఫ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్, ఎగ్జిట్ పోల్ ఫలితాలపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్

2లో..

# ఆలోచనతో రండి..

ఈ సందర్భంగా మరో 17 జిల్లాల్లో రూ.873 కోట్ల వ్యయంతో 868 ఎకరాల్లో అభివృద్ధి చేసిన 49 ఎంఎస్‌ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటితో పాటు రూ.25,256 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 38 మెగా పారిశ్రామిక యూనిట్లను కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం పలు జిల్లాల పారిశ్రామికవేత్తలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

### పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. "ఈ రోజు 99 కంపెనీలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నాం. వీటి ద్వారా రూ.2.65 లక్షల కోట్ల పెట్టుబడులతో 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. జనవరి నాటికి మరో 70 ఎంఎస్‌ఎంఈ పార్కులను ప్రారంభిస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే మా లక్ష్యం" అని సీఎం వివరించారు. టెక్నాలజీ భవిష్యత్తును శాసిస్తుందని, అందుకే అమరావతిలో జనవరికి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. సౌర విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్, బయో ఫ్యూయెల్ ప్లాంట్ల ఏర్పాటుతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తామన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, త్వరలోనే సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటు కానున్నట్లు వెల్లడించారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోనున్నామని, తద్వారా 8 లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

### గత పాలనపై తీవ్ర విమర్శలు

గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి పారిపోయారని, పరిశ్రమలు మూతపడ్డాయని చంద్రబాబు విమర్శించారు. "గతంలో పారిశ్రామికవేత్తలు 'ఛలోఛలో' అంటూ రాష్ట్రం నుంచి వెళ్లిపోతే, ఇప్పుడు 'భలేభలే' అంటూ తిరిగి వస్తున్నారు. విశాఖకు గూగుల్ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడితో వస్తోంది. ఇదే మా ప్రభుత్వంపై ఉన్న నమ్మకం" అని అన్నారు. గత పాలకులు పీపీఏలు రద్దు చేసి, విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్లు చెల్లించారని, ఆ డబ్బు ఉండి ఉంటే ఎన్నో ప్రాజెక్టులు పూర్తయ్యేవని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం ఏ పాలసీ తెచ్చినా దేశంలో మొదట అమలు చేసేది ఏపీనే అని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి సహకారం అందిస్తుండగా, మంత్రి లోకేశ్ పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేస్తున్నారని ప్రశంసించారు.

### సంపద సృష్టి.. ప్రజల భాగస్వామ్యం

రాష్ట్రంలో సంపద సృష్టించి, అందులో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "ఆలోచనలే ఇప్పుడు ఆస్తి. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులు కూడా ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తలుగా మారాలి," అని పిలుపునిచ్చారు. ఎంఎస్‌ఎంఈల ద్వారానే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడితో రిఫైనరీ ఏర్పాటు చేస్తోందని, పోర్టులను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని ఈస్ట్ కోస్ట్ లాజిస్టిక్స్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. 15 శాతం వృద్ధి రేటు సాధించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

### వెనుకబడిన ప్రాంతాలకు పెద్దపీట

వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిశ్రమలు, సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "2026 నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు నీళ్లిస్తాం. కనిగిరి ఇకపై కనకపట్నం అవుతుంది. కరవు పీడిత ప్రాంతాలైన కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలకు గోదావరి జలాలను కూడా తీసుకొస్తాం. 2019లో మేం అధికారంలోకి రాకపోవడం వల్లే ఈ ప్రాజెక్టు ఆలస్యమైంది," అని అన్నారు.

భవిష్యత్తులో ప్రజలకు ఇలాంటి కష్టాలు రాకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# బిహార్‌లో ఎన్డీఏకే ఓటేసిన ఎగ్జిట్ పోల్స్

విపక్షానికే పరిమితం కావాల్సి వస్తుందని ఈ ఎగ్జిట్ పోల్ ఫలితాలు చెప్తున్నాయి. మరోవైపు తొలిసారి బరిలోకి దిగిన ప్రశాంత్ కిషోర్ పార్టీ జన్ సురాజ్ కూడా కనీస సీట్లతో సరిపెట్టుకుంటుందని వెల్లడించాయి.మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్ లో ఎన్డీయేకు 147 నుంచి 167 సీట్లు దక్కుతాయని, మహాకూటమికి 70-90 సీట్లు లభిస్తాయని, జన్ సురాజ్ పార్టీకి 2-8 సీట్లు వస్తాయని తేలింది. పీపుల్స్ ఇన్ సైట్ ఎగ్జిట్ పోల్ లో ఎన్డీయేకు 133-148 సీట్లు, మహాకూటమికి 87-102 సీట్లు, జన్ సురాజ్ పార్టీకి 0-2 సీట్లు, ఇతరులకు 3-6 సీట్లు వస్తాయని తేలింది. చాణక్య స్ట్రాటజీస్ ఎగ్జిట్ పోల్ లో ఎన్డీయేకు 130-138 సీట్లు, మహాకూటమికి 100-108 సీట్లు, జన్ సురాజ్ కు 0, ఇతరులకు 3-5 సీట్లు వస్తాయని తేలింది. పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ లో ఎన్డీయేకు 133-159, మహాకూటమికి 75-101 సీట్లు, జన్ సురాజ్ కు 0-5 సీట్లు, ఇతరులకు 2-8 సీట్లు వస్తాయని తేలింది. జేవీసీ పోల్ లో ఎన్డీయేకు 135-150 సీట్లు, మహాకూటమికి 88-103 సీట్లు, జన్ సురాజ్ కు 0-1 సీట్లు, ఇతరులకు 3-6 సీట్లు వస్తాయని తెలిపారు. దైనిక్ భాస్కర్ ఎగ్జిట్ పోల్ లో ఎన్డీయేకు 145-160 సీట్లు, మహాకూటమికి 73-91 సీట్లు, జన్ సురాజ్ కు 0, ఇతరులకు 5-10 సీట్లు వస్తాయని తేలింది. పీమార్క్ పోల్ లో ఎన్డీయేకు 142-162 సీట్ల, మహాకూటమికి 80౼98 సీట్లు, జన్ సురాజ్ కు 1-4 సీట్లు, ఇతరులకు 0-3 సీట్లు వస్తాయని తేల్చారు.ఇక అధికార ఎన్డీఏ కూటమిలో బీజేపీ, జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), హిందుస్తాన్ ఆవామ్ మోర్చా, రాష్ట్రీల లోక్ మోర్చా వంటి పార్టీలు ఉన్నాయి. మరోవైపు ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ కూటమిలో రాష్ట్రీయ జనతా దళ్, కాంగ్రెస్, సీపీఐ (ఎమ్ఎల్), వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ, సీపీఐ, సీపీఎం, ఇండియన్ ఇన్‌క్లూజివ్ పార్టీ, జనశక్తి జనతా దళ్ వంటి పార్టీలు ఉన్నాయి. ఇక ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ పార్టీ అయిన జన సురాజ్ పార్టీ కూడా ఈసారి బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా ఈనెల 6వ తేదీన తొలి విడతలో భాగంగా 18 జిల్లాల్లో 121 సీట్లలో పోలింగ్ జరిగింది. ఇక తొలి దశలో 64.46 శాతానికిపైగా పోలింగ్ శాతం నమోదైంది. ఇక జరిగిన రెండో దశ విడతలో భాగంగా 20 జిల్లాల్లోని 122 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో సాయంత్రం 6 గంటల వరకే 68.44 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. ఈనెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించనున్నారు.

# దేశంలోనే తెలంగాణ నంబర్ వన్

దీని ముఖ్య ఉద్దేశం. దీనికింద.. రాష్ట్రాలు కనీసం 10,000 కృత్రిమ రీఛార్జ్, స్టోరేజీ ట్యాంకులను నిర్మించాల్సి ఉంటుంది. అదేవిధంగా మున్సిపల్ కార్పొరేషన్లు 10,000, పట్టణ స్థానిక సంస్థల్లో 2,000 వరకు ఇటువంటి నిర్మాణ పనులను పూర్తి చేయాలి. ఈ లక్ష్యాన్ని తెలంగాణ అందుకుంది. దేశంలోనే అత్యధికంగా 5.2 లక్షల జల సంరక్షణ నిర్మాణాలను పూర్తి చేసింది. మొత్తంగా, బీహార్, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, జమ్మూ కాశ్మీర్‌తో సహా వివిధ రాష్ట్రాల నుంచి 67 జిల్లాలను అవార్డులకు ఎంపిక చేశారు. అగ్రస్థానంలో నిలిచిన రాష్ట్రాలు, జిల్లాలకు కోటి నుంచి రూ. 2 కోట్ల వరకు నగదు బహుమతులు అందించనుండగా, కేటగిరీ 3 కింద ఉన్న జిల్లాలకు రూ. 25 లక్షలు లభిస్తాయి.

# అక్రమార్కుల నయా దందా

జుక్కల్,: ఇసుక డిమాండ్ అక్రమార్కులకు వరంగా మారింది. అనుమతుల ముసుగులో జోరుగా అక్రమ దందా సాగుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరిట అనుమతులు తీసుకుని ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పొతంగల్ మండలం కొడిచర్ల శివారులోని మంజీర ఒడ్డున ఇద్దరు రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, ఆ ఇసుకను నిర్మాణాలకు ఉచితంగా ఇస్తామని సంబంధితశాఖ అధికారుల నుంచి లబ్ధిదారుల పేర్లతో కొందరు అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. దీంతో మేటలు తొలగించేందుకు వారు అనుమతులిచ్చారు. తర్వాత పట్టా భూమిలో రోడ్లు వేసి ట్రాక్టర్లలో ఇసుక నింపి మరోచోట డంపు చేస్తున్నారు. ఆ నిల్వల నుంచి అనుమతికి మించి పెద్ద టిప్పర్లలో ఇసుక తరలిస్తున్నారు.

# అతివలకు సర్కారు కానుక

గద్వాల, : పొదుపు సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం దసరా, బతుకమ్మ సంబరాల సందర్భంగా చీరలను పంపిణీ చేయాలని భావించింది. కాని పలు కారణాలతో అమలుకు నోచుకోలేదు. దీంతో అప్పటి నుంచి అతివలు చీరల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్కారు చీరలను పంపిణీ చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరలను కానుకగా ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా డీఆర్డీవో అధికారులకు ఆదేశాలు వచ్చాయి.

# భారత్‌కు భారీ భూకంపాల ముప్పు

భవిష్యత్‌లో భారీ భూకంపాలను ఎదుర్కొనే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. భూమి అంతర్గత నిర్మాణానికి సంబంధించి అమెరికన్ జియోఫిజికల్ యూనియన్ (ఏజీయూ) 2023 సమావేశంలో శాస్త్రవేత్తలు సంచలన ఆవిష్కరణను ప్రకటించారు. భారత్ టెక్టోనిక్ ప్లేట్ టిబెట్ పీఠభూమి కింద లోతుగా చీలిపోతూ రెండు పొరలుగా విడిపోతోందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను డీలామినేషన్ అని శాస్త్రవేత్తలు పిలుస్తున్నారు. భారత, యూరేషియన్ టెక్టోనిక్ ప్లేట్‌ల ఘర్షణ కారణంగానే హిమాలయాలు ఆవిర్భవించడం, టిబెట్ పీఠభూమి నిర్మాణం జరిగిందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే తాజా భూకంప డేటా ఈ టెక్టోనిక్ ప్లేట్ల ఘర్షణ మరింత సంక్లిష్టంగా ఉందని రుజువు చేసింది.

### టెక్టోనిక్ ప్లేట్ ఎలా చీలుతోంది?

తాజా అధ్యయనం కోసం శాస్త్రవేత్తలు 94 అబ్జర్వేషన్ స్టేషన్ల నుంచి పీ-వేవ్స్ (క్షితిజ సమాంతర), ఎస్-వేవ్స్ (నిలువు) డేటాను విశ్లేషించారు. దీని ద్వారా ఇండియన్ ప్లేట్ లోపలి నిర్మాణం 3డీ మోడల్‌ను రూపొందించారు. ఈ డేటా ప్రకారం భారత టెక్టోనిక్ ప్లేట్‌లోని దట్టమైన దిగువ పొర విడిపోయి భూమి మాంటిల్‌లోకి మునిగిపోయి కరిగిపోతోందని గుర్తించారు. అదే సమయంలో తేలికైన పైపొర మాత్రం యూరేషియన్ ప్లేట్‌ను ఢీకొంటూ ఉత్తరం వైపునకు కదులుతోందని తెలిపారు. ఖండాలు ఈ విధంగా ప్రవర్తిస్తాయని తమకు తెలియదని నెదర్లాండ్స్‌లోని ఉట్రెక్ట్ యూనివర్సిటీ జియోడైనమిసిస్ట్ డౌవే వాన్ హిన్స్‌బెర్గెన్ వెల్లడించారు. ఎర్త్ సైన్స్‌కు ఇది చాలా ముఖ్యమైన విషయమని పేర్కొన్నారు.

### హిమాలయాలు ఎందుకు పెరుగుతున్నాయి.?

భారత టెక్టోనిక్ ప్లేట్ చీలిక కారణంగా దిగువ ప్లేట్ మాంటిల్‌లోకి మునిగిపోతున్నప్పటికీ పై పొర మాత్రం ముందుకు కదులుతూ ఒత్తిడిని పెంచుతోందని గుర్తించారు. ఇలా నిరంతరం కదలడం వల్ల టిబెట్ కింద లోతైన పగుళ్లు, భూకంప ఒత్తిడి ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ పగుళ్లను విశ్లేషించడం ద్వారా శాస్త్రవేత్తలు ఆ ప్రాంతంలో తరచుగా భూకంపాలు ఎందుకు సంభవిస్తున్నాయి అనేది తెలుసుకునే అవకాశం కలగనుంది.

అదే సమయంలో కొన్ని ప్రాంతాలు మాత్రమే ఎందుకు వేగంగా పెరుగుతున్నాయి అనే విషయాలను కూడా తెలుసుకోవచ్చని చెబుతున్నారు.

### భూకంప హెచ్చరికలు

ఈ ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ దిగువ భాగం మరింత మునిగిపోయే కొద్దీ వాటి పగుళ్ల వెంట భారీ ఒత్తిడి ఏర్పడి భవిష్యత్తులో భారీ మొత్తంలో భూకంపాలకు దారితీసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ ఆవిష్కరణ కేవలం భూగర్భ శాస్త్ర సిద్ధాంతాలను మార్చడమే కాకుండా హిమాలయ ప్రాంతం ఎదుర్కొంటున్న భూకంప ప్రమాదాలను మరోసారి నొక్కి చెబుతోంది.

# వ్యక్తిగతంగా హాజరవుతా.. వారం గడువు ఇవ్వండి

స్పెషల్ సీబీఐ కోర్టుకు దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో జగన్ తన అభ్యర్థనను వెనక్కితీసుకుని, వారం రోజుల సమయం కోరారు. సీబీఐ కోర్టు ఆ అభ్యర్థనను అంగీకరించి, నవంబరు 21 వరకు మినహాయింపు ఇచ్చింది. జగన్ మోహన్ రెడ్డి యూరప్ పర్యటనకు అనుమతి కోసం సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ సమయంలో యూరప్ పర్యటనకు వెళితే వచ్చిన తర్వాత నవంబర్ 14వ తేదీ వరకు తప్పక హాజరు కావాలని ఆదేశించింది. యూరప్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత జగన్ తాను వ్యక్తిగతంగా హాజరు కాలేనని పిటిషన్ వేశారు. తాను కోర్టుకు హాజరు కావాలంటే ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. అందుకే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతానని వాదించారు. ఈ అభ్యర్థనపై సీబీఐ మంగళవారం కౌంటర్ దాఖలు చేసింది. "వ్యక్తిగత హాజరు తప్పనిసరి. మినహాయింపు ఇవ్వకూడదు" అంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో కోర్టులో ట్రయల్ ప్రారంభం కావాల్సి ఉంది.

# అందెశ్రీ కుటుంబానికి అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. అందెశ్రీ తన జీవితాన్ని, గళాన్ని, కలాన్ని నిస్వార్థంగా తెలంగాణ సమాజానికే అంకితమిచ్చారని కొనియాడారు. ఆయన చివరి రోజు వరకు సాధారణ జీవితం గడిపిన మహనీయుడని గుర్తు చేసుకున్నారు. దివంగత కవి కుటుంబానికి అండగా నిలబడతామని ప్రకటిస్తూ ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు.అంతేకాక.. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన ఆయన రచించిన 'జయ జయహే తెలంగాణ' పాటను పాఠ్యాంశంగా పాఠశాల సిలబస్‌లో చేరుస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అందెశ్రీ రచనలన్నింటినీ సేకరించి పుస్తక రూపంలో తీసుకొచ్చి రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలలో అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. ఆయన రాసిన 'నిప్పుల వాగు' పుస్తకం ఒక మార్గదర్శిగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. అందెశ్రీ వ్యక్తిగతంగా తనకు చాలా దగ్గరి వ్యక్తి అని ఆయన లేని లోటు తన కుటుంబానికి వ్యక్తిగతంగా తీరని నష్టమని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన చెందారు. గతంలో గద్దర్ పాటతో పాటు, అందెశ్రీ పాట కూడా ఉద్యమానికి ఎంతో బలాన్ని ఇచ్చిందని అన్నారు. ఆయన పేరు మీద ఒక స్మృతివనం ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. చివరిగా అందెశ్రీకి పద్మశ్రీ గౌరవం దక్కాలని గతేడాది కేంద్రానికి లేఖ రాసినా రాలేదని గుర్తు చేశారు. ఈసారి కూడా కేంద్రానికి లేఖ రాస్తామని ఈ విషయంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సహకరించాలని ఆయన కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి అందెశ్రీకి ఆ గౌరవాన్ని దక్కేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఎదురుకాల్పులు జరిపాయి. సాయంత్రం వరకు కాల్పులు అడపాదడపా కొనసాగాయి.ఈ ఘటనలో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ధృవీకరించారు. ఘటనా స్థలం నుంచి ఇన్సాస్ రైఫిల్స్, స్టెన్ గన్స్, .303 రైఫిల్స్‌తో పాటు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. మావోయిస్టుల యూనిఫాంలు, కమ్యూనికేషన్ పరికరాలు, విప్లవ సాహిత్యం పుస్తకాలు కూడా లభించాయని తెలిపారు. ఈ ఆపరేషన్‌పై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ స్పందించారు. "ప్రస్తుతం మావోయిస్టు సంస్థ నాయకత్వం, దిశానిర్దేశం లేకుండా నైతికంగా దెబ్బతింది. కేవలం అబూజ్‌మఢ్ అడవుల్లోని కొన్ని ప్రాంతాలకే వారి ఉనికి పరిమితమైంది. నిఘా ఆధారిత ఆపరేషన్ల విజయానికి ఇది నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. తప్పించుకున్న మావోయిస్టులు పొరుగు జిల్లాల్లోకి ప్రవేశించకుండా అదనపు బలగాలను మోహరించి, అడవులను జల్లెడ పడుతున్నామని ఆయన తెలిపారు.

# ప్రతి ఉగ్రవాదినీ వేటాడండి

ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ కుమార్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్ సదానంద్ వసంత్ పాల్గొన్నారు. కాగా, ఇప్పటికే అమిత్ షా పేలుడు జరిగిన స్థలాన్ని పరిశీలించారు.

### ఎన్ఐఏ చేతికి దర్యాప్తు..

కాగా, ఈ కేసు దర్యాప్తును కేంద్ర హెూం శాఖ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అప్పగించింది. వెంటనే రంగంలోకి దిగిన ఎన్ఐఏ ఘటనా స్థలికి చేరుకుని సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. పేలుడు సంభవించిన చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపులు చర్యలు చేపట్టింది. సాక్ష్యాల సేకరణ, స్థానిక అధికారుల సమన్వయంతో అనుమానితుల కదలికలపై నిఘా పెట్టింది. ఘటన వెనుక కుట్రను ఛేదించేందుకు చర్యలు తీసుకుంటోంది. అయితే ఈ పేలుడుపై మొదటగా దిల్లీ పోలీసులు ఉపా చట్టం, ఎక్స్‌ప్లోజివ్స్ చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే కేంద్రం దీన్ని ఉగ్రచర్యగా భావిస్తున్నందున, దర్యాప్తు ఎన్ఐఏకు అప్పగించారు. అయితే ఢిల్లీ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు నివేదికను హెూం మంత్రిత్వ శాఖకు సమర్పించారు. జైషే మహ్మద్ ఉగ్రసంస్థతో ఫరీదాబాద్ డాక్టర్లకు సంబంధాలపై నివేదికలో ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు.

### ఏ ఒక్కరినీ వదలం..

ఈ పేలుడు ఘటన జరిగిన తర్వాత భూటాన్ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ, అక్కడి నుంచే కారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన 12 మంది కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తాను చాలా బాధాతప్త హృదయంతో ఇక్కడికి వచ్చానట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగిన భయంకరమైన సంఘటన అందరినీ తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. బాధితుల దుఃఖాన్ని తాను అర్థం చేసుకోగలనని ప్రధాని మోదీ అన్నారు. యావత్ దేశం బాధితులకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అంతేకాకుండా తమ భద్రతా ఏజెన్సీలు ఈ కుట్ర వెనుక ఉన్నవారి అంతు చూస్తాయని పేర్కొన్నారు. బాధ్యుల్లో ఏ ఒక్కరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టమని వార్నింగ్ ఇచ్చారు

# ప్రజలంతా నవీన్ వైపు నిలిచారు

పార్టీ భారీ విజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలంతా నవీన్ యాదవ్ వైపు నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఉప ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమను ముందుండి నడిపించారని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. నవీన్ యాదవ్ తప్పకుండా గెలుస్తారని, ఆయన విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ టీపీసీసీ చీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో తాము సఫలీకృతం చెందామని ఆయన అన్నారు.

# సమగ్ర వికాసం.. విద్యార్థి పరిపూర్ణం

ఆలంపూర్, : విద్యార్థి జీవితాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దడానికి విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం మొదలు, సేవ చేయడం వరకు పలురకాల కార్యక్రమాల నిర్వహణకు సమగ్ర శిక్షా ద్వారా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. 'స్కౌట్స్-గైడ్స్' పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి తాజాగా ఆదేశాలు జారీ అయ్యాయి. కేజీబీవీలు, ఎంపిక చేసిన పీఎంశ్రీ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలు చేయనున్నారు. ఇందుకు ఉమ్మడి జిల్లాలో 96 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో 75 కస్తూర్బాలు, 14 పీఎంశ్రీ పాఠశాలలు, 8 మోడల్ స్కూల్స్, ఒక రెసిడెన్షియల్ (మహబూబ్‌నగర్) పాఠశాలలు ఎంపికయ్యాయి.

# తల్లి ఇంటి ముందు కన్నకొడుకు నిరసన!

సూర్యాపేట,: సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాలలో కన్నెబోయిన మంగమ్మ ఇంటి ముందు ఆమె పెద్ద కొడుకు ఉపేందర్ కుటుంబం నిరసన తెలిపింది. తన సోదరుడు కిరణ్ తనకు అన్యాయం చేస్తున్నాడని, న్యాయం చేయాలని లేదంటే ఆత్మహత్య చేసుకుంటామని ఉపేందర్ కుటుంబం ఆరోపించింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

# ప్రయాణికులను దింపగానే తగులబడ్డ బస్సు

కోదాడ, : చిట్యాల వద్ద బస్సు ఇంజిన్ నుంచి మంటలు చెలరేగి బస్సు పూర్తిగా దగ్ధమైంది. చౌటుప్పల్ వద్ద టీ బ్రేక్ కోసం ఆగి, బయల్దేరిన 10 నిమిషాలకే ఈ ఘటన జరిగింది. డ్రైవర్ అప్రమత్తతతో బస్సును రోడ్డు పక్కకు నిలిపి, 29 మంది ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించడంతో పెను ప్రమాదం తప్పింది. అంతలోనే బస్సు మంటల్లో చిక్కుకుంది. సకాలంలో స్పందించడం వల్ల భారీ ప్రాణనష్టం నివారించబడింది.

# మునగాలలో జాతీయ రహదారి ప్రమాదాలు నివారించేందుకు బారికేడ్‌ల ఏర్పాటు

తుంగతుర్తి, : జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు మునగాల మండల పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. మునగాల సర్కిల్ సీఐ రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు, ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆకుపాముల వై జంక్షన్ వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించడానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల జాతీయ రహదారిపై వాహనాలు వేగాన్ని తగ్గించి ప్రయాణిస్తున్నాయి. పోలీసుల ఈ చర్య పట్ల వాహనదారులు, పాదాచారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వావిళ్ళపల్లి-గొల్లగూడెం రోడ్డు దుస్థితి: గ్రామస్తుల ఆవేదన

భువనగిరి, : భువనగిరి నియోజకవర్గం, సంస్థాన్ నారాయణపురం మండలంలోని వావిళ్ళపల్లి నుండి గొల్లగూడెం వరకు ఉన్న రోడ్డు కంకర రాళ్లతో నిండిపోయి, గుంతలు పడి, బురదమయంగా మారింది. దీనితో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డును బాగుచేయాలని వారు కోరుతున్నారు.

# రెండు బైకులు ఢీ..

## ఎంఈవోతో సహా ముగ్గురికి గాయాలు

ఆలేరు,: మండల విద్యాధికారి ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎంఈవోతో సహా ముగ్గురికి గాయాలైన సంఘటన ఆత్మకూర్ (ఎస్) మండలం ముక్కుడు దేవులపల్లి స్టేజి వద్ద సూర్యాపేట-దంతాలపల్లి రోడ్డుపై మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... నూతనకల్ మండలం చిల్పకుంట్లకు చెందిన సూర నాగరాజు, అతని ఇద్దరు కొడుకులు సూర హరీష్, సూర అరవింద్ ముగ్గురూ కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. మండలంలోని ముక్కుడు దేవులపల్లి స్టేజీ సమీపంలో ఆత్మకూర్ (ఎస్) మండల విద్యాధికారి పి. ధారాసింగ్ వెళ్తున్న వాహనాన్ని వీరి ద్విచక్రవాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధారాసింగ్, నాగరాజు, అరవింద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి.

# కలెక్టరెట్లో మైనారిటీ సంక్షేమ దినోత్సవం

కామారెడ్డి, : కామారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం మైనారిటీ సంక్షేమ దినోత్సవం, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగా ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మదన్ మోహన్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ రవితేజ, మైనారిటీ సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారి జయరాజ్, డీ. పి. ఆర్. ఓ తిరుమల, విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# తెగిపడిన తీగలు.. తప్పిన ప్రమాదం

ఎల్లారెడ్డి, : కామారెడ్డి జిల్లా పెద్దకొడపగల్ మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో విద్యుత్తు తీగలు జనావాసాలపై తెగిపడ్డాయి. స్థానికులు చాకచక్యంగా స్పందించి విద్యుత్తు సిబ్బందికి సమాచారం అందించడంతో ప్రమాదం తప్పింది. 11 కేవీ తీగలను తొలగించాలని ప్రజావాణిలో దరఖాస్తు చేసినా అధికారుల స్పందన కరవైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి..

మంచిర్యాల, : కుటుంబ తగాదాలు, భర్త వేధింపులు తట్టుకోలేక దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన మార్గం లలిత(30) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఆమె బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్చోడ మండలం సిరిచెల్మ గ్రామానికి చెందిన లలితకు దిలావర్‌పూర్‌కు చెందిన మార్గం సురేష్‌కు పదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లిలో వరకట్నం కింద రూ. 3 లక్షల నగదు, రెండు తులాల బంగారం ఇవ్వడానికి ఒప్పుకున్నారు. అన్ని కట్న కానుకలు చెల్లించగా ఇంకా 20వేల నగదు ఇవ్వాల్సి ఉంది. వరకట్నంపై తరచూ దంపతులకు గొడవలు జరిగేవి. ఆదివారం సాయత్రం భార్యాభర్తలకు మళ్లీ గొడవ జరిగింది. లలిత అపస్మారక స్థితికి చేరడంతో సురేష్ నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించాడు. అప్పటికే మృతి చెందిందని వైద్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న లలిత కుటుంబ సభ్యులు ఆసుపత్రి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా ఉరి వేసినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ఇంటి వద్ద గర్భస్రావం

### ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గిరిజన మహిళ మృతి

బెల్లంపల్లి, : మారుమూల గ్రామం.. ఆపై గుట్ట ప్రాంతం, సరైన రహదారి సౌకర్యం లేదు, వైద్య సేవలు అంతంతమాత్రమే వెరసి.. ఓ నిండు ప్రాణం బలైన హృదయవిదారక ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. చిచ్‌పెల్లి పంచాయతీ పరిధిలోని ఖాతిగూడకు చెందిన గిరిజన మహిళ మడావి మారుబాయి(21) ఎనిమిది నెలల గర్భిణి. ఈ నెల 7వ తేదీన ఇంటి వద్దే గర్భస్రావం జరిగింది. అనంతరం ఆమెకు వైద్య చికిత్సలు అందించేందుకు కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించలేదు. ఈక్రమంలో తీవ్ర రక్తస్రావమై పరిస్థితి విషమంగా మారడంతో.. ఆమెను అంబులెన్స్‌లో వాంకిడి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్‌కు రిఫర్ చేశారు. ఈమేరకు ఆసిఫాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. సకాలంలో వైద్యం అందక గిరిజన మహిళ ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. రవాణా సౌకర్యం లేకపోవడంతోనే అత్యవసర వైద్య సేవల సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని గిరిజనలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గూడు కరవు.. సమస్యల దరువు

చెన్నూరు, : పరిపాలనా సౌలభ్యం కోసం గత ప్రభుత్వం చిన్న గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అయితే కొత్త పంచాయతీలకు భవనాలు మంజూరు చేయకపోవడంతో.. ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పలుచోట్ల ప్రభుత్వ పాఠశాలల భవనాలు, మరికొన్ని అద్దె భవనాలు, రైతు వేదికల్లో కొనసాగుతున్నాయి. ఉన్న భవనాల్లో కనీస సౌకర్యాలు లేక.. అధికారులు, ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని పంచాయతీలకు భవనాల నిర్మాణానికి నిదులు మంజూరు కాగా పనులు ప్రారంభించారు.

## అధిక లోడు.. ఛిద్రమవుతున్న రోడ్లు

సిర్పూర్,: కంకర, ఇసుక, మొరం వంటి అధిక లోడ్‌తో పరుగెడుతున్న లారీలు రోడ్లను దెబ్బతీస్తున్నాయి. మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్న సిర్పూర్ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో యథేచ్ఛగా సాగుతున్న భారీ వాహనాల రాకపోకలతో.. నూతనంగా వేసిన రాష్ట్ర, పంచాయతీ రహదారులు గుంతలు పడి అధ్వానంగా మారుతున్నాయి. మరమ్మతులకు ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయి. రహదారిపై కంకర, ఇసుక పడుతుండటంతో.. వెనుక వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడటమేకాకుండా ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి.

## లంచావతారాల భరతం పడుతున్నాం!

జగిత్యాల, : చేయాల్సిన పనికి లంచం అడుగుతూ.. ప్రజలను ఇబ్బంది పెట్టే వారి భరతం పడుతున్నామని అవినీతి నిరోధకశాఖ (అనిశా) డీఎస్పీ విజయ్‌కుమార్ అన్నారు. ప్రధాన శాఖల్లో పెచ్చుమీరుతున్న అవినీతిపై ఫిర్యాదులు అందుతున్నాయని.. బాధితులకు అండగా నిలబడుతూ అక్రమార్కులను కటకటాల్లోకి పంపుతున్నామని చెప్పారు. ఓ వైపు లంచం ఇవ్వకూడదనే ప్రచారం విస్తృతంగా చేస్తూనే మరోవైపు దాడులు, తనిఖీలు, సోదాలతో శాఖాపరమైన చర్యల్లో దూకుడును పెంచుతున్నామన్నారు. అవినీతి మహమ్మారిని తరిమి కొట్టాలంటే అందరి సహకారం అవసరమన్నారు.

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం.. వివాదాలకు నిలయం

కోరుట్ల, : భూముల క్రయవిక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లలో నిత్యం ఏదో ఒక గొడవతో గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పనితీరు వివాదాస్పదంగా మారింది. ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్లతో బాధ్యతాయుతంగా పనులు జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల రామడుగు మండలం గుండి గ్రామంలో ఒకే సర్వే నంబరులో ఒకరికి పట్టా చేసి మరొకరికి నిరాకరించడం, కొత్తపల్లి మండలం రేకుర్తి పరిధిలోని అపార్ట్‌మెంట్ విక్రయ దస్తావేజును తిరస్కరించడంతో శ్రీకాంత్ అనే వ్యక్తి కార్యాలయానికి వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు. చింతకుంట గ్రామానికి చెందిన ఆ భూమి నిషేధిత జాబితాలో లేకపోయినా ఎందుకు తిరస్కరించారని సబ్‌రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం డీఐజీకి చరవాణి ద్వారా అధికారి తీరుపై ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఇటీవల జరిగిన ఘటనలు ఆరా తీసి సదరు అధికారిని వెనక్కి రప్పించాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

## వివాహం చేయడం లేదని తండ్రి హత్య

ధర్మపురి, ): తనకు పెళ్లి చేయడం లేదని కన్న తండ్రిపై కర్రతో కుమారుడు దాడికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మెట్‌పల్లిలో విషాదం నింపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం పట్టణంలోని దుబ్బవాడకు చెందిన ఎల్ల గంగనర్సయ్య(74)కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలకు వివాహాలై అత్తవారిళ్లలో ఉంటున్నారు. కుమారుడు అన్వేష్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేశాడు. గల్ఫ్ వెళ్లి తిరిగొచ్చి ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో అన్వేష్ మానసిక వ్యాధి బారిన పడటంతో తండ్రి చికిత్స చేయించారు. కొంతకాలంగా తనకు పెళ్లి చేయాలని, తన గురించి పట్టించుకోవాలంటూ తండ్రితో గొడవ పడుతున్నాడు. ఇదే కారణంగా గత ఫిబ్రవరిలో తండ్రిపై, పక్షవాతంతో బాధ పడుతున్న తల్లి రమాదేవిపై దాడికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర..



మంథని, : పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో మంగళవారం అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు చింతపండు సంపత్ ప్రారంభించారు. రైతులకు అన్ని ఏర్పాట్లు చేశామని, నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపిస్తామని, మద్దతు ధర లభిస్తుందని ఆయన తెలిపారు. రైతులు తమ ధాన్యం వివరాలను నమోదు చేయించుకొని ఆరబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు చంద శంకర్, చుంచు సదయ్యలు పాల్గొన్నారు.

## రాజస్థాన్‌లో సింగరేణికి స్థలం కేటాయింపు

పెద్దపల్లి, : రాజస్థాన్ రాష్ట్రంలో విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అక్కడి ప్రభుత్వంతో సింగరేణి ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సౌర విద్యుత్తు కేంద్రాలకు స్థలాన్ని కేటాయిస్తూ అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు రెవెన్యూ శాఖకు చెందిన 2,980 హెక్టార్ల స్థలాన్ని గుర్తించింది. సింగరేణి రాజస్థాన్ ప్రభుత్వంతో సంయుక్తంగా విద్యుత్తు కేంద్రాలను నిర్మించేందుకు అంగీకారం కుదుర్చుకుంది. 1000 మెగావాట్ల సౌర విద్యుత్తు కేంద్రంతో పాటు 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల నిర్మాణానికి అవగాహన చేసుకుంది. ఈ క్రమంలో సౌర విద్యుత్తు కేంద్రాల నిర్మాణానికి బికనీర్, జైసల్మేర్ ప్రాంతాల్లో 2,980 హెక్టార్ల స్థలాన్ని ఇవ్వాలని అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

రామగుండం, నవంబర్ 11(ఎ.ఎం.ఎస్): కేంద్ర హోం శాఖ దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించడంతో, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో భద్రతా చర్యలను బలోపేతం చేశారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్లు, జన సమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, పోలీసు జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

## పాఠశాల బస్సు ఢీకొని బాలుడు మృతి

కొత్తగూడెం, : పాఠశాల బస్సు ఢీకొని ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన చంద్రుగొండ మండలం కరిశెలబోడు తండా గ్రామంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. కరిశలబోడు గ్రామానికి చెందిన భూక్య గోపి, అఖిల దంపతులకు దర్శిత్, దాక్షశ్రీ ఇద్దరు పిల్లలు. మంగళవారం దర్శిత్(3) ఆడుకుంటూ వెళ్లి పాఠశాల బస్సు కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ సంఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ జరుపుతున్నారు.

## ఇక్కడ చదివితే.. పాస్ అవ్వాల్సిందే!

భద్రాచలం, : ఒకటి కాదు.. రెండు కాదు.. వరుసగా 13ఏళ్లుగా పదోతరగతిలో 100% ఉత్తీర్ణతతో ఘనకీర్తిని సొంతం చేసుకుంది.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మరే ప్రభుత్వ పాఠశాలకు సాధ్యమవని రికార్డును తన పేరిట లిఖించుకుంది.. ఉపాధ్యాయుల సమష్టికృషి, విద్యార్థుల పట్టుదల వెరసి ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. అదే దమ్మపేట మండలం గండుగులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల. 2020–21లో కొవిడ్ ప్రభావంతో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకుండానే అందరినీ ప్రభుత్వం పాస్ చేసిన విషయం విదితమే.

## మత్తుకు కళ్లెం.. దేశంలోనే ప్రథమం!

పినపాక, : దట్టమైన అడవులు.. రాష్ట్రాల సరిహద్దులు దాటేందుకు అనువైన ప్రదేశాలు.. గంజాయి సాగుకు అనుకూలమైన ప్రాంతాలు.. వెరసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంగా గంజాయి రవాణా అధికంగా సాగుతోంది. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు గంజాయిని సులభంగా తరలించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను వారధిగా ఎంచుకుంటున్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులను కలిగి ఉండటంతో ఎక్కువ శాతం గంజాయిని ఈ జిల్లా మీదుగా రవాణా చేస్తున్నారు. అందుకే గంజాయి రవాణా కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ఎక్కువ మోతాదులో గంజాయిని పోలీసులు స్వాధీనపరచుకుంటున్నారు.

## కేంద్ర సహాయ మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు

అశ్వారావుపేట, : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఖమ్మం వేణుగోపాల్‌నగర్‌కు చెందిన షేక్ మౌలాలి అనే వ్యక్తిపై కేసు నమోదైంది. భాజపా ఒకటో పట్టణ అధ్యక్షుడు గడీల నరేశ్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌కు, రెండో పట్టణ కమిటీ అధ్యక్షుడు ధనియాకుల వెంకటనారాయణ యాదవ్ ఆధ్వర్యంలో ఖమ్మం రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ బాలకృష్ణకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. బాధ్యునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. టూటౌన్ పరిధిలో మౌలాలిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.

# వణికిస్తున్న చలి

ఇల్లందు, : జిల్లాలో గత మూడు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. కొద్దిరోజుల క్రితం వరకు పగలు, రాత్రి ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఒక్కసారిగా వాతావరణం మారింది. ఉష్ణోగ్రతలు 16 నుంచి 21 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ఏసీలు, ఫ్యాన్ల వాడకం తగ్గటంతో విద్యుత్తు వినియోగం క్షీణించింది. పిల్లలు, వృద్ధులు, మహిళలు చలికి సతమతమవుతున్నారు.

## మహబూబాబాద్‌లో హై అలర్ట్ పోలీసుల తనిఖీలు

జనగామ, : కేంద్ర హోం శాఖ హై అలర్ట్ నేపథ్యంలో, మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు మంగళవారం భద్రతా చర్యలను బలోపేతం చేశారు. టౌన్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్, బస్టాండ్ వంటి రద్దీ ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ బృందంతో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు.

## నిబంధనలకు చెల్లు.. చెవులకు చిల్లు

పాలకుర్తి, : ద్విచక్ర వాహనాలకు కంపెనీల నుంచి వచ్చే సైలెన్సర్లను కాకుండా కొంత మంది తమకు నచ్చిన పరికరాలను అమరుస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. పోలీసులు తనిఖీలు చేసినప్పుడు కేసులు నమోదు చేసి వాటిని అక్కడే తొలగిస్తున్నారు. అయినా చాలా మందిలో మార్పు కనిపించడం లేదు. ఎక్కువగా విద్యార్థులు, యువత వింత శబ్దాలతో కూడిన సైలెన్సర్లను అమరుస్తూ రోడ్లపై వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలో ముగ్గురు మెకానిక్‌లు ఇలాంటి సైలెన్సర్లను మార్పిడి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాల నుంచి స్వాధీనం చేసుకున్న పరికరాలను పోలీసులు రహదారిపై రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు.. నిర్మాణాలు జోరు

ములుగు,: పేదల సొంతింటి కలను నిజం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ములుగు జిల్లాలో మంచి పురోగతిలో ఉంది. నిర్మాణ బిల్లుల చెల్లింపును వారంలో ఒక రోజు అప్పటి వరకు ఉన్న పురోగతి ప్రకారం పనులను లెక్కలోకి తీసుకొని బిల్లుల చెల్లింపు ప్రక్రియ జరుగుతుంది. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. దీంతో లబ్ధిదారులు వేగంగా పనులు చేపడుతున్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిలో రాష్ట్రంలోనే ములుగు జిల్లా మూడో స్థానంలో ఉంది. జిల్లా ముందంజలో ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు, గృహ నిర్మాణ శాఖ పీడీకి ప్రశంసా పత్రాలు అందాయి.

## మొదటి అంతస్తుకు అనుమతి!

నర్సంపేట, : ఇందిరమ్మ ఇళ్లు తప్పనిసరిగా 400– 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలనే నిబంధనలున్నాయి. కొన్నిచోట్ల నిర్ణీత విస్తీర్ణంలో ఇళ్లు కట్టడం లేదని అనుమతి రద్దు చేసింది. పట్టణ ప్రాంతాల్లో తక్కువ విస్తీర్ణం కారణంగా ఇళ్లు మంజూరైనా నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపించడం లేదు. దీంతో పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు ఎక్కువగా నష్టపోతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. తక్కువ విస్తీర్ణం స్థలాలున్న లబ్ధిదారులను దృష్టిలో ఉంచుకొని.. నిబంధనలను సడలించింది. 400 చదరపు అడుగులు (44.4 చదరపు గజాలు)లోపు స్థలం ఉన్నా.. జీ ప్లస్ వన్ విధానంలో ఇళ్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పించింది. ఫలితంగా జిల్లాలోని నిర్ణీత స్థలం కన్నా తక్కువ ఉన్న లబ్ధిదారులకు ఊరట కలగనుంది.

# మిల్లుల ఎంపిక సవాలే!

పరకాల, : ధాన్యం కొనుగోళ్లలో కాంటా వేసిన వడ్లను మిల్లులకు తరలించడమే అసలైన పరీక్ష. సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం పౌరసరఫరాలశాఖ మిల్లులకు కేటాయించాల్సి ఉంటుంది. ఆయా ప్రాంతాలకు దగ్గరలోని మిల్లులను ఎంపిక చేయాలి. గతంలో సీఎంఆర్ కోసం ఇచ్చిన ధాన్యాన్ని పక్కదారి పట్టించి భారీగా సొమ్ము చేసుకున్న యజమానుల మిల్లులు డిఫాల్ట్ జాబితాలో చేరాయి. గత వానాకాలం కేటాయించిన ధాన్యానికి వంద శాతం బియ్యం తిరిగిచ్చిన మిల్లులకే ఈసారి అవకాశం ఇవ్వాలన్నది నిబంధన. సీఎంఆర్ ఎగవేత సమస్యల నేపథ్యంలో 10శాతం బ్యాంకు గ్యారంటీ నిబంధనను ప్రభుత్వం విధించింది. ఇప్పటికే బ్యాంకు రుణాలు పొందిన మిల్లర్లకు ఆయా బ్యాంకులు పూచీకత్తులు, రుణాలు ఇవ్వకపోవటంతో మిల్లుల కొరత ఏర్పడే అవకాశం ఉంది.

### సురక్షితంగా ప్రయాణం..

## అందుబాటులో సమాచారం

స్టేషన్‌ఘన్‌పూర్, : జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో వాహనం ఆగినా.. చోదకులకు ఆకలేసినా.. అనుకోని ఆరోగ్య సమస్యలు ఎదురైనా వెంటనే తగిన సమాచారం లేకుంటే ఆందోళనకు గురికాక తప్పదు. ఈ నేపథ్యంలో వాహనదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు.. సురక్షితంగా ప్రయాణించేలా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయం తీసుకుంది. హైవేలపై అవసరమైన సమాచారం సులభంగా అందుబాటులో ఉండేలా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇటీవల వెల్లడించింది. అత్యవసర నంబర్లు, ఎన్‌హెచ్‌ఏఐ కార్యాలయాలు, ఆసుపత్రులు, పెట్రోలు బంకులు, ఠాణాలు, రెస్టారెంట్లు, టోల్ ప్లాజా దూరం, హైవేపై గస్తీ, హెల్ప్‌లైన్ నంబర్లు తదితర వివరాలు వాటిల్లో లభ్యమవుతాయి. వీటిని సూచిక బోర్డులపై ఏర్పాటు చేయనున్నారు.

## బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్మదీక్ష

సంగారెడ్డి, : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 2% రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్మదీక్ష నిర్వహించారు. బీసీలకు నలుపు రెండు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ ప్రభు గౌడ్, నాయకులు మల్లికార్జున్ పటేల్, కృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన నిర్మల రెడ్డి



ఆందోల్, : సంగారెడ్డి పట్టణంలోని మైదానంలో టీజీఐఐసీ రిపేర్ చేయండి పర్సన్ నిర్మల రెడ్డి మంగళవారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. యువకులకు క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, తెలంగాణ స్టూడెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ జయంతి



జహీరాబాద్, : దేశ తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ మాధురి మంగళవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అబుల్ కలాం ఆజాద్ స్ఫూర్తితో ముందుకు సాగాలని, దేశ విద్యా శాఖ మంత్రిగా ఆయన విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి

హుస్నాబాద్, : హుస్నాబాద్ ఏడీఏ వ్యవసాయ శాఖా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న అన్నబోయిన సుందరయ్య మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన 1988లో గ్రామ సర్పంచ్ గా, 2001లో ఎంపీటీసీగా ఎన్నికై రాజకీయాల్లోనూ, వ్యవసాయ శాఖలో ఉద్యోగిగానూ తనదైన ముద్ర వేశారు. ఆయన మృతితో అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## నల్లవాగు ప్రాజెక్టులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నారాయణఖేడ్, : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# కర్మయోగి మదన్‌మోహన్ మాలవ్య

భారత దేశ వాసులచే -మహాత్ముని'గా గౌరవించ బడిన మహా మనీషి జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. అలాంటి గాంధీ చేతే -మహామాన-బిరుదు పొందిన నేత పండిట్ మదన్ మోహన్ మాలవ్య. మదన్ మోహన్ మాలవ్య (1861-1946) భారతీయ విద్యావేత్త, రాజకీయ వేత్త. భారతీయ స్వాతంత్ర్యో ద్యమంలో పాల్గొన్న సమర యోధుడు. ఆయన "పండిట్ మదన్ మోహన్ మాలవీయ" గా కూడా సుపరిచితుడు. ఆయన "మహాత్మా" గా కూడా గౌవరింప బడ్డాడు. మాలవ్య1915 లో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం వ్యవస్థాపకుడు. వారణాసిలో ఈ విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా నాలుగు సార్లు పనిచేశాడు. 1861, డిసెంబర్ 25 తేదిన అలహాబాదులో మూనాదేవి, బ్రిజ్‌నాథ్ దంపతులకు జన్మించిన మదన్ మోహన్ మాలవ్య పూర్వీకులు మధ్యప్రదేశ్ లోని మాల్వా ప్రాంతం నుండి వలస వచ్చారట. అందుకే ఆయన ఇంటి పేరు కూడా మాలవ్యగా సార్థక మైంది. ఆయన అసలు ఇంటి పేరు చతుర్వేది. మాలవ్యాలు బెనార్స్ లోని అగర్వాల్ వర్తకులకు ఇంటి పురోహితులుగా ఉన్నారు. ఆయన తండ్రి సంస్కృత గ్రంథములను అభ్యసించేవాడు. ఆయన శ్రీమద్భాగవతమును చెప్పి ధనం సంపాదించే వాడు. మాలవ్య సంప్రదాయకంగా రెండు సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత ఆయన ఆంగ్ల పాఠశాలలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. పాఠశాల రోజుల నుండే మకరంద్ అనే కలం పేరుతో కవిత్వం రాయడం ప్రారంభించాడు మాలవ్య. 1879 లో ముయిర్ సెంట్రల్ కాలేజీ నుండి మెట్రి క్యులేషన్ పూర్తి చేశాడు. ఆ కళాశాల ప్రస్తుతం అలహాబాదు విశ్వ విద్యాలయంగా ప్రసిద్ధి చెందినది. మాలవ్యా కలకత్తా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. లో పట్టభద్రులైనాడు. సంస్కృతం లో ఎం.ఎ చేయాలనుకున్నప్పటికీ ఆయన కుటుంబ పరిస్థితులు సహకరించలేదు. తర్వాత ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని మొదలు పెట్టాడు. అంతకు ముందే ఆయన 'ది ఇండియన్ ఒపీనియన్' అనే పత్రికకు సబ్ ఎడిటర్‌గా పని చేశాడు. అలాగే న్యాయ శాస్త్రంలో కూడా పట్టా పొందాడు. 1907లో మాలవ్య స్వయంగా 'అభ్యుదయ' అనే వార్తాపత్రిక ప్రారంభించాడు. 1909 లో అలహాబాదు నుండి వెలువడు తున్న ఆంగ్ల పత్రిక లీడర్ పత్రికను స్థాపించాడు. ఆయన 1924 నుండి 1946 వరకు హిందూస్థాన్ టైమ్స్‌కు చైర్మన్ గా ఉన్నాడు. ఆయన సేవలు 1936 లో హిందీ ఎడిషన్ ప్రారంభానికి ఉపయోగపడ్డాయి. 1908లో బ్రిటీష్ ప్రభుత్వం పత్రికలపై ఆంక్షలు విధించి నప్పుడు.. వాటికి వ్యతిరేకంగా అలహాబాద్‌లో అఖిల భారత కాన్ఫరెన్సును నిర్వహించాడు. 1922లో హిందు మహాసభ అధ్యక్షుడుగా పనిచేశాడు. "సత్యమేవ జయతే" అనే నినాదాన్ని తొలినాళ్లలో ప్రాచుర్యం లోకి తీసుకొచ్చింది మాలవ్యనే. మాలవ్య భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా నాలుగు సార్లు (1909, 1913,1919,1932) పని చేశాడు. ఆయన 1934లో కాంగ్రెస్ ను విడిచి పెట్టాడు. హిందూ మహాసభలో ముఖ్యమైన నాయకునిగా కూడా ఉన్నాడు. 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రేసు పార్టీకి ప్రాతినిధ్యం వహించాడు. 1922 లో చౌరీ చౌరా దాడుల ఘటనలో మరణశిక్ష పడిన 225 మంది స్వాతంత్ర్య సమర యోధులు, సాధారణ ప్రజానీకం తరపున వాదించి వారిలో 153 మందికి ఆ శిక్ష పడకుండా కాపాడగలిగాడు. గంగా నది పరిరక్షణ కోసం 'గంగా మహాసభ' పేరుతో ఉద్యమాన్ని కూడా లేవదీశాడు మాలవ్య. భారతీయ స్కౌట్స్ మరియు గైడ్స్ వ్యవస్థాపకులలో మాలవ్య ఒకడు. బ్రిటీష్ నియంతల రాజ్యానికి ఊతమిచ్చేందుకు ప్రారంభించిన సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా గళం విప్పాడు. బ్రిటిష్ రాజ్యంలో భారత భవిష్యత్తును నిర్ధారించ డానికి ఏర్పాటైన సైమన్ కమీషన్ ను వ్యతిరేకించడానికి లాలా లజపతి రాయ్, జవహర్ లాల్ నెహ్రూ ఇంకా ఇతర స్వాతంత్ర సమర యోధులతో కలిశాడు. 1931లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీతో కలిసి కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహించాడు. "సత్యమేవ జయతే" అనే నినాదాన్ని వ్యాపింప చేసాడు. ఆయన గొప్ప విద్యావేత్త, కర్మయోగి, భగవద్గీతను అనుక్షణం అనుసరించడానికి ఇష్టపడే వాడు. సమకాలిక నాయకుల వలే కులమత భేదములను పోగొట్టడానికి ప్రయత్నించాడు. 1932 ఆగష్టులో జరిగిన రెండవ రౌండు టేబులు సమావేశం తరువాత రామ్సే మెక్డొనాల్డ్ ప్రధాన మంత్రిగా ఉన్న బ్రిటిషు ప్రభుత్వం, బి.ఆర్.అంబేద్కర్ ప్రతిపాదన మేరకు బ్రిటిషు ప్రభుత్వం కమ్యూనల్ అవార్డును తీసు కొచ్చింది. ప్రభుత్వం అల్ప సంఖ్యాక మతస్తులకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయడం ఈ అవార్డు లక్ష్యం. అయితే ముస్లిములు, సిక్కులతో పాటు, దళితులను కూడా అల్ప సంఖ్యాక మతస్తులుగా ఈ అవార్డు ప్రకటించింది. అయితే మహాత్మా గాంధీ దీన్ని వ్యతిరేకించాడు. దళితులను విడదీస్తే హిందూ మతం విచ్ఛిన్నం అవుతుందని భావించి, అందుకు నిరసనగా గాంధీ పూనాలోని ఎరవాడ జైల్లో నిరాహార దీక్ష చేపట్టాడు. కాంగ్రెసు నాయకులు గాంధీ వాదనకు మద్దతు తెలిపారు. ఆ సమయంలో అంబేద్కరు ఎరవాడ జైల్లో గాంధీతో చర్చలు జరిపాడు. వారి చర్చల ఫలితంగా వెలువడిందే పూనా ఒప్పందం. 1932లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రతిపాదించిన పూనా పాక్ట్ అగ్రిమెంట్ పై ఆయనతో కలిసి మాలవ్య సంతకం చేశాడు. మాలవ్య బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు.

వారణాసిలో ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. ఇది ఆసియాలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ విశ్వ విద్యాలయం, ప్రపంచం లోనే పెద్ద విశ్వ విద్యాలయం. ఇందులో 12,000 లకు పైగా విద్యార్థులు కళలు, విజ్ఞాన శాస్త్రము, ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీలలో విద్యనభ్య సిస్తున్నారు. మాలవ్య ఆ విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా 1919 నుండి 1938 వరకు పనిచేశాడు. జీవితకాలం మొత్తం బ్రహ్మచారిగానే గడిపిన మాలవ్య 1946 నవంబరు 12 (వయసు 84)న బనారస్ లో మరణించాడు. డిసెంబర్ 24,2014 న మదన్ మోహన్ మాలవ్యను ఆయన మరణాంతరం భారతదేశం లోని ప్రతిష్ఠాత్మక అవార్డు భారతరత్నకు వరించింది.

# అసమాన ప్రతిభాశాలి వెంకట సుబ్బన్న

కడప వెంకటసుబ్బన్న తెలుగు సాహిత్యంలో అసమాన ప్రతిభాశాలి. అవధాన ప్రక్రియలో అందెవేసిన చేయి. సహస్రాధిక అవధాన కార్యక్రమ నిర్వహణా దురంధరులు. అవధానాలు మాత్రమే కాక, పురాణ ప్రబందా లను అలవోకగా రచించిన సవ్యసాచి. సి.వి. సుబ్బన్న.(కడప వెంకట సుబ్బన్న) అద్భుతమైన ప్రతిభ, అనన్య సామాన్యమైన వ్యుత్పత్తి, అసాధారణమైన అభ్యాసం కలిగిన శతావధాని. వర్ణన, సమస్యా పూరణం, వ్యస్తాక్షరి, న్యస్తాక్షరి, నిషేధాక్షరి మొదలైనా ఏ అంశాన్నయినా అలవోకగా నిర్వహించగలిగిన సరస్వతీ పుత్రుడు. వెయ్యికి పైగా అవధానాలు నిర్వహించిన ఘనత ఆయనదే. సుబ్బన్న కడప జిల్లా ప్రొద్దుటూరు లో నవంబరు 12 , 1929 న కడప రంగమ్మ చెన్నప్ప దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య ప్రొద్దుటూరులో, సెకండరీ విద్య అనీబిసెంట్ మునిసిపల్ హైస్కూలులో, ఇంటర్మీడియట్ మదనపల్లి అనీబిసెంట్ కళాశాలలో జరిగింది. తరువాత డిగ్రీ, ఎం.ఎ. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి పూర్తి చేశారు. కె.సుబ్బ రామప్ప పర్యవేక్షణలో "అవధాన విద్య" అనే విషయంపై పరిశోధనచేసి మైసూరు విశ్వ విద్యాలయం నుండి 1981లో పి.హెచ్.డి పట్టాను పొందారు. అదే సంవత్సరం అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేటుతో ఆయనను సత్కరించారు. ఆంధ్ర దేశాన్ని అవధానాలతో ఉర్రూతలూపి, పద్యాన్ని పశువుల కాపరి దాకా తీసుకుపోయిన తిరుపతి వేంకట కవులు గ్రంథాలు రచించి తమ పద్యా విద్యా ప్రతిభను ప్రదర్శించినట్లే, సి.వి. సుబ్బన్న శతావధాని కూడా శతానేక అవధానాలు చేసి పదికి పైగా పద్య గ్రంథాలు రచించారు. సుబ్బన్న అనేక ప్రాంతాల్లో చేసిన అవధానాల్ని క్రోడీకరించి మూడు సంపుటాలుగా ముద్రించారు. ఆమూడింటిని కలిపి శతావధాన ప్రబంధం త్రిపుటిః పేరుతో బృహద్గ్రంథాన్ని ప్రచురించారు. శ్రీ భద్రాచల రామదాస ప్రబంధం, దివ్య లోచన ప్రబంధం (ధనుర్దాసు) భోజ కువింద చరిత్రము, గోపవధూ కైవల్యము, త్రివేణి, దుర్భిక్షము, పల్లె పదాలు, కళావాహిని, తీయని త్రోవ, నైవేద్యము, అష్టావక్రుడు, పురందర దాసు, కుంతి, చెంచులక్ష్మి (నాటకం), శ్రీ వీరాంజనేయ శతకం, శ్రీకృష్ణ శతకం, శ్రీ రామలింగేశ్వర శతకం, శ్రీ వేంకటేశ్వర శతకం అనే గ్రంథాల్ని రచించి ప్రచురించారు. అవధాన విద్యను గూర్చి ఆయన రచించిన సిద్ధాంత గ్రంథాన్ని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు ముద్రించారు. 'శ్రీ వ్యాసవిలాస ప్రబంధము'ను సి.వి.సుబ్బన్న 2004లో మొదటి ముద్రణగా వెలువరించారు. తర్వాతి సంవత్సరమే ఇది రెండవ ముద్రణకు నోచుకొని, అశేష ప్రజాదరణ పొందింది. అష్టాదశ పురాణాల రచనయే గాకుండా పంచమ వేదమైన భారత రచనకు నడుం బిగించి, మహావిష్ణువు అవతారమైన వ్యాసుని జీవిత పూర్వాపరాలను ప్రబంధంగా రచించడం ద్వారా ప్రతిభ తేట తెల్ల మయింది. శ్రీ వ్యాస విలాస ప్రబంధము'లో ఏడు ఆశ్వాసాలలో... ప్రతి ఆశ్వాసం లోనూ కథను సక్రమంగా నడిపించటానికి, ఆయా సన్ని వేశాలకు ప్రత్యేక శీర్షికలుంచటం, అరుంధతీ పాణి గ్రహణంతో ప్రథమాశ్వాసం ప్రారంభమై, తర్వాత పరాశర జననం, వసురాజు, శుక్తిమతి మత్స్యగంధి వృత్తాంతాలు, సద్యోగర్భంలో వ్యాసుడు మత్స్యగంధికి పరాశరునికి జన్మించటం, శంతనుడు గాంగేయుని భీష్మ ప్రతిజ్ఞ తదితర అంశాలను మూలాన్ని విభేదించకుండా రాయడం అద్భుత రచనా సృష్టికి, సామర్థ్యానికి తార్కాణం. 2007లో ప్రథమ ముద్రణగా వెలువరించిన ప్రబంధం 'భద్రాచల శ్రీరామదాస ప్రబంధము', భద్రాచల రామదాసుగా ప్రసిద్ధి పొందిన కంచెర్ల గోపన్న జీవిత చరిత్రను, ఆనాటి చారిత్రక విశేషాలను పద్య ప్రబంధంగా సుబ్బన్న రచించారు. సంస్కృత సమాస భూయిష్టంగా పద్యాన్ని ఎలా కూర్చారో, తేట తెలుగు పదాలతో పద్యాన్ని అలాగే భావం, విషయం, పటుత్వం తగ్గకుండా జేయగలిగిన గొప్ప ప్రతిభాశాలి సుబ్బన్న. మొదటి అవధానం ప్రొద్దుటూరులో 1950వ సంవత్సరంలో శివరాత్రి పర్వదినం నాడు చేశారు. చివరి అవధానం 1997లో ఫిబ్రవరి 25వ తేదీన పేరాలలో చేశారు. ఈ మధ్య కాలంలో అంటే 47 సంవత్సరాల పాటు వెయ్యికి పైగా అష్ట, శతావ ధానాలు చేశారు. భారత దేశ మంతా తిరిగి అవధాన ప్రతిభా సామర్థ్యాన్ని నిరూపించు కొన్నారు. షష్టిపూర్తి తర్వాత కూడా ధారణ తగ్గకుండా అవధానాలు చేసి అందరి మెప్పులు పొందిన సరస్వతీ పుత్రులు సుబ్బన్న శతావధాని. సాహిత్య రంగంలో లబ్ధప్రతిష్ఠులైన దేవులపల్లి కృష్ణ శాస్త్రి, చెలమచెర్ల రంగాచార్యులు, కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, డా.దివాకర్ల వేంకటావధాని, వెంపరాల సూర్య నారాయణ శాస్త్రి , గంటిజోగి సోమయాజి, దీపాల పిచ్చయ్య శాస్త్రి, మధునా పంతుల సత్య నారాయణ శాస్త్రి , డా.పుట్టపర్తి నారాయణాచార్యులు, దాశరథి, డా.సి.నారాయణరెడ్డి, ఆరుద్ర వంటి వారెందరో సుబ్బయ్య అవధానాలలో పృచ్ఛకులుగా వ్యవహరించిన గొప్పతనాన్ని మూట కట్టుకున్నారు. ప్రబంధ రచనలో, కవిత్వ పటుత్వ సంపదలో సాటిలేని మేటిగా పేరెన్నిక గన్నారు. పద్యానికి కాలం చెల్లిందను కొంటున్న కాలంలో, పెద్ద కావ్యాలకు ఆదరణ కరువు అవుతున్నది అనుకునే సమయంలో ఛందోబద్ధంగా అద్భుత ప్రబంధాల్ని రచించి సహృదయ పాఠకుల, శ్రోతల మన్ననలను పొందిన సి.వి.సుబ్బన్న శతావధాని ప్రజ్ఞ అనన్య సామాన్యం. అవధాన ప్రక్రియను తిరుపతి వేంకట కవులు కొప్పరపు సోదరుల తర్వాత విశేషంగా వ్యాప్తి చేసిన సాహితీవేత్తగా సుబ్బన్నకు పేరుంది. 1964లో గుర్రం జాషువా అధ్యక్షతన ఆయనకు భట్టిప్రోలులో కనకాభిషేకము, గజారోహణ మహోత్సవం జరిగింది. ఆయనకు పది పర్యాయాలు కనకాభిషేకం జరిగింది. 1965లో దీపాల పిచ్చయ్య శాస్త్రి అధ్యక్షతన బెజవాడ గోపాల రెడ్డిచే అవధాని ఎడమ కాలికి గండ పెండేరము తొడగ బడింది. 1981లో శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం వారిచే గౌరవ డాక్టరేటు పొందారు. అనేక సన్మానాలు, సత్కారాలు పొందారు. విశాఖలోని లోక్ నాయక్ ఫౌండేషన్ అందించే విశిష్ట పురస్కారం, మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చేతుల మీదుగా పురస్కార గ్రహీతగా నిలిచారు. సరస్వతీ పుత్ర, అవధాని పితామహ బిరుదులు పొందారు. సుబ్బయ్య మార్చి 5, 2017న హైదరాబాదులో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాసను విడిచారు.

# స్వార్థమే పరమార్థం కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం

కుటుంబం అనగా ఒకే గృహంలో నివసించే కొంత మంది మానవుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్నవారు. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. "రక్త సంబంధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు కుటుంబ సమైక్యత, సంఘటితం గురించి ప్రజలందరికీ అవగాహన కలిగించడం, జాతీయ అంతర్జా తీయ స్థాయిలో సుస్థిర కుటుంబాలకు దోహదం చేయడం, నైపుణ్యాన్నీ, అనుభవాలను, సామాజిక విలువలను పరస్పరం పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో సరైన సమాచారాన్ని, సహకారాన్ని అందించడం, కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి లక్ష్యాలతో నవంబర్ 12ను జాతీయ కుటుంబ సౌహార్ద్ర దినోత్సవంగా జరుపు కుంటారు. భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందు పరచబడి ఉంది. నాగరి ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. ప్రాచీన కాలం నుండి ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదలతో తూల తూగాయ నడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అందరిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉండే వంటే ఆత్మీయత అనురాగం, ఉట్టి పడేలా చేసేవి. తల్లిదండ్రులు, అత్త మామలు, అక్క చెల్లెళు ,, అన్నదమ్ములు, బావా మరదళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్రతో కళకళలాడే ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదల నిలయాలు. పిల్లలు చిన్న వయస్సులో ఉన్నపుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుంబాలు వారివే. అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉదయిస్తాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించినప్పటికీ వంశవృక్షపు వేళ్ల మూలాలు మాత్రం మొదటి కుటుంబంను అల్లుకునే ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకోవడం అత్యంత సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుక రించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీదా తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. కేవలం ఫోన్ లోనో, మొబైల్ లోనో యోగ క్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టి ల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశయోక్తి కాదు. అనేక కుటుం బాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలక రించుకునే సమయం చిక్కడం లేదంటే కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసు కోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహాలిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీ యులు దూరం కావడం, కనీసం మనసు లోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కనిపించే దృశ్యం. కుటుంబ దౌర్జన్యం చట్టం 498-ఎను దుర్వినియోగం చేయడం ద్వారా కొందరు భార్యలు, భర్తలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు బనాయించి వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. బోగస్ వరకట్న కేసులు బనాయించడం ద్వారా దేశవ్యాప్తంగా 57 వేల మంది పురుషులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే పురుషులు వివాహం చేసుకోవడానికి వెనుకంజ వేసే పరిస్థితి వస్తుంది. భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న విభేదాలు న్యాయస్థానం వెలుపలనే పరిష్కరించు కోవడం సముచితంగా ఉంటుందని నవంబరు 12 ను జాతీయ కుటుంబ సౌహార్ద్ర దినోత్సవంగా జరుపు కోవాలని నిర్ణయించారు.

# న్యుమోనియా ప్రాణాంతకం..

2021లో న్యుమోనియా అంటువ్యాధితో 2.2 మిలియన్లు మరణించగా అందులో 5.02 లక్షల మంది పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల లోపు వయసున్న పిల్లల అధిక మరణాలకు కారణమైన వ్యాధి న్యుమోనియా. కోవిడ్-19 కారణంతో మరో 10 మిలియన్లు కూడా అదనంగా మరణించినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అధిక ప్రాణాలను గైకొంటున్న వ్యాధుల్లో న్యుమోనియా ప్రధానమైనదని తేలింది. వాతావరణ ప్రతికూల మార్పులు, గాలి కాలుష్యం కోరలు చాచడంతో శ్వాస వ్యవస్థ, ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నం కావడం, న్యుమోనియా మహా విపత్తు వస్తుందనే భయం కూడా ఉందని, మిలియన్ల జనులు న్యుమోనియా సోకే ప్రమాదపు అంచున ఉన్నారని వైద్యులు అంచనా వేస్తున్నారు. న్యుమోనియా వ్యాధి ఐదేండ్ల లోపు పిల్లలకు, వృద్ధులకు వస్తుంది. టీకాలు వేయించుకోని వారు, పోషకాహారలోపాలు, ఇంట్లో వంట చెరుకు వాడే వారు, కలుషిత గాలి పీల్చే పెద్దలు, పొగ త్రాగే దురలవాటు ఉన్న వారు అధికంగా న్యుమోనియా బారిన పడే ప్రమాదం ఉంటుంది. న్యుమోనియా వ్యాధి తీవ్రత, ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం 2009 నుంచి ప్రతి ఏట 12 నవంబర్ రోజున "ప్రపంచ న్యుమోనియా దినం" పాటిస్తూ ఆ వ్యాప్తి పట్ల కనీస అవగాహన కల్పించడం జరుగుతోంది. బ్యాక్టీరియా, వైరస్ లేదా ఫంగీ సంక్రమణ కారణంగా తాపజనక శ్వాస రుగ్మత (ఇన్‌ఫ్లమేటరీ రెస్పిరేటరీ డిసార్డర్) లేదా న్యుమోనియా వ్యాధి అంటుకుంటుంది. ఈ సూక్ష్మజీవులు ఊపిరితిత్తుల్లో చేరి "ఎల్వియోలి" అనే భాగంపై ప్రభావాన్ని చూపి న్యుమోనియాకు దారి తీస్తుంది. దీని వల్ల ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. బలహీన వ్యాధినిరోధకశక్తి కలిగిన పిల్లలు, వృద్ధులకు న్యుమోనియా సోకి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. ప్రపంచ న్యుమోనియా దినం -2025 ఇతివృత్తంగా "పిల్లల మనుగడ (చైల్డ్ సర్వైవల్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. న్యుమోనియా నివారించదగిన అంటువ్యాధి. వ్యాధిగ్రస్థులు తుమ్మడం, దగ్గడం, ముక్కు చీదడం లాంటి సందర్భాల్లో మరొకరికి సంక్రమిస్తుందని తెలుసుకోవాలి. పిల్లల్లో బ్యాక్టీరియా కారణ స్ట్రెప్టోకోకల్ న్యుమోనియా అతి ప్రధానమైనది. దాని తర్వాత హిమోఫిలస్ ఇన్‌ఫ్లుయెంజా రెండవ ప్రధానమైనది. న్యుమోనియాలో రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ వ్యాధి వైరస్ వర్గంలో ముఖ్యమైనది. న్యుమోనియా వ్యాధికి చికిత్స కూడా అందుబాటులో ఉన్నది. ప్రపంచ న్యుమోనియా దినం వేదికగా ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్య శాఖ, ఎన్‌జిఓలు, ఇతర సంస్థలు కలిసి న్యుమోనియా పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, రోగగ్రస్థులకప చికిత్సా పద్ధతులు వివరించడం మంచి ఫలితాలను ఇస్తాయి. న్యుమోనియాను తొలిదశలో గుర్తించడం, చికిత్స తీసుకోవడం, నివారణ మార్గాలను తెలుసుకోవడం లాంటి అంశాలను గుర్తుంచుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ప్రతి ఏట 14 లక్షల పిల్లలు న్యుమోనియా సోకి చనిపోవడం, పిల్లల మరణాల్లో 18 శాతం వరకు న్యుమోనియా కారణం కావడం గమనార్హం. యూనిసెఫ్ వివరాల ప్రకారం ప్రతి 39 సెకన్లకు ఒక పిల్లవాడు న్యుమోనియాతో మరణిస్తున్నాడు. వృద్ధుల్లో న్యుమోకోకల్ న్యుమోనియా అధికంగా సోకుతుంది. న్యుమోసిస్టిక్ జిరోవేస్సీ వ్యాధి ఫంగస్ సోకడంతో వస్తుంది. గాలి కాలుష్యం, స్మోకింగ్ వల్ల 16 లక్షల వృద్ధులు మరణిస్తున్నారు.

డబ్ల్యూహెచ్‌ఒ, యూనిసెఫ్‌లు సంయుక్తంగా న్యుమోనియా, డయేరియా వ్యాధుల కట్టడికి గ్లోబల్ ఆక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు, 65 ఏండ్లు దాటిన వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్న రోగులు, పర్యావరణ కాలుష్య ప్రాంతాల్లో నివసిస్తున్న జనులు, హెచ్‌ఐవి/క్యాన్సర్ లాంటివి సోకిన వ్యాధిగ్రస్థులు న్యుమోనియా ప్రమాదంలో పడే అవకాశాలే ఎక్కువ. టీకాలు వేయించడం, పోషకాహారం అందిచడం, గాలి కాలుష్యాన్ని తగ్గించడం వల్ల న్యుమోనియా వ్యాధి తీవ్రత తగ్గుతుంది. ఆంటీబ్యాక్టీరియల్, అంటీ వైరల్, ఆంటీ ఫంగల్ ఔషధాలతో న్యుమోనియా కట్టడి జరుగుతుంది. భౌతిక దూరాలు పాటించడం, మాస్కులు ధరించడం, పబ్లిక్ పిరజేశాల్లో ఉమ్మి వేయకుండా ఉండడం, దగ్గినపుడు లేదా తుమ్మినపుడు కండువా కప్పుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, నదుల్ని కలుషితం కాకుండా చూసుకోవడం లాంటి పలు దాగ్రత్తలు న్యుమోనియా కేసులను తగ్గిస్తాయి. పిల్లలకు, పెద్దలకు అతి ప్రమాదకరమైన అంటు వ్యాధిగా నిలిచిన న్యుమోనియా పట్ల సరైన అవగాహన పెంచుకొని అలాంటి ప్రాణాంతక రుగ్మతకు చరమగీతం పాడదాం, న్యుమోనియా కానరాని భారతాన్ని నిర్మించుకుందాం.

# ప్రజల గుండె చప్పుడైన కవి

బడికి వెళ్లి ఆయన అక్షరాలు చదవలేదు.. కానీ సమాజాన్ని ఆయన తన అంతర్ హృదయంతో చూశారు. సమాజంలో జరుగుతున్న ప్రజల వ్యథలు, పోరాటాలను కళ్లతో చూసి.. ఆ బాధలే ఆయనను ప్రజల పక్షాన ప్రజా గొంతుకగా నిలబడేలా చేసింది. చిన్నతనం నుంచే అనాథగా బతికిన ఆయన గుండెకు తాకిన గాయాలు ఎన్ని ఉంటాయో.. గొడ్ల కాపరిగా పనిచేస్తూ ప్రకృతి.. మూగజీవాలతోనూ మమేకం అయ్యారు. ప్రకృతి ఎదుర్కొనే ముప్పును సైతం పదాల అల్లికతో జత కట్టి పాటలు, పద్యాలు పాడుకున్నాడు. సమాజంలో భిన్నమైన సమస్యలతో సతమతమవుతున్న ప్రజల బతుకులను చూశాడు. కన్న తల్లిదండ్రులను పట్టించుకోకుండా.. మానవ సంబంధాలకు కనీస విలువనివ్వని సమాజాన్ని కళ్లారా చూశారు. ఆయన కళ్లతో చూసిందే.. పదాల అల్లికతో గేయంగా మారి ఆ గాయాన్ని మాన్పింది. అణచివేతల మీద ఆయన పాట ఉక్కు పిడి కిళ్లుగా మారాయి. అన్యాయంపై గళమెత్తే జన గర్జన అయింది. అందుకే అందెశ్రీ ఉద్యమ జన జాతర. తెలంగాణ మలి విడత ఉద్యమం ఉధృతంగా మారిన సమయంలో అందెశ్రీ పాటలు ప్రజల్లో గొప్ప పోరాట పటిమను చూపాయి. జన జాతరలో మన గీతం జయకే తనమై ఎగరాలి.. జంజవారుతా జన నినాదమై సాగాలి.. అంటూ మలి విడత ఉద్యమంలో ఆయన కవిత్వాలు లక్షలాది మందిని కదిలించాయి. చిన్న తనంలోనే కష్టాలు చూసిన అందెశ్రీ ప్రజల బతుకుల్లో గుణాత్మక మార్పు, సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో రచనలు చేశారు. రవి చేరని చోటు ఉంటుంది.. కానీ కవి చేరని చోటు ఉండదు అన్నట్లుగా ఆయన కవిత్వం, పాటల రూపంలో ప్రతీ గుండెను తాకారు. ఆవేదనల గుండెలకు బలయ్యారు. అణచివేతపై తిరుగుబాటు గళం అయ్యారు. పోరాట పిడికిళ్లకు పదునైన గీతంగా మారాడు అందెశ్రీ. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. అనాథగా పెరిగిన అందెశ్రీ చిన్నతనంలోనే కష్టాలు వెంటాడాయి. తన కష్టాలను ప్రజల్లో, సమాజంలో చూసిన ఆయన తన పల్లెతో, ప్రకృతితో, మనుషుల హృదయాలతో మమేకం అయ్యారు. పల్లె జీవన బతుకులు తెలిసిన వ్యక్తిగా పల్లె నీకు వందనాలమ్మో.. తల్లీ నీకు వందనాలమ్మో.. అంటూ పల్లెను తల్లితో పోల్చి బతుకు విలువను నేర్పిన పల్లెలపై మమకారాన్ని చాటారు. కొమ్మ చెక్కితే బొమ్మరా.. కొలిసి మొక్కితే అమ్మరా మాయమైపోతున్నాడమ్మా మని షన్నవాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు అంటూ సమాజంలో మంట కలుస్తున్న మానవ సంబంధాలపై రాసిన పాటలన్నీ ఆయన గుండెల నుంచి సమాజం కోసం ఉప్పొంగిన గొప్ప అక్షరాలు.. తెలంగాణ మలి విడత ఉద్యమం ఉధృతంగా మారిన తరుణంలో ఆ గేయం ఓ పోరాట తిలకంగా నిలిచింది. జనజాతరలో మనగీతం జయకేతనమై ఎగరాలి.. ఒకటే జననం.. ఓహో ఒకటే జననం.. జీవితమంతా జనమే మననం.. కష్టనష్టాలు ఎన్ని ఎదురైనా కార్యదీక్షలో తెలంగాణ అంటూ ఉప్పొంగిన గేయం తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష సాకారానికి ఎంతో భూమిక పోషించింది. అనేక రచనలు, కవిత్వాలతో ఆయన ఎంతోమంది సాహిత్య కారులకు, ప్రజా పోరాటాలకు ఓ చైతన్య గొంతుకగా నిలిచారు. ఆయన చేసిన అనేక రచనలకు కేయూ గౌరవ డాక్టరేట్‌ను సైతం ప్రదానం చేసింది. ఆయన పాటలు నంది అవార్డుతో పాటు ఎన్నో అవార్డులు గెలుచుకుని ఎంతోమంది ప్రజల గుండెలను గెలుచుకున్నారు. తెలంగాణ మలివిడత ఉద్యమంలో ధూంధాంకు ఉన్న సాంస్కృతిక ఉద్యమ పాత్ర గొప్పది. ఆ సమయంలో నాటి ఉమ్మడి పది జిల్లాలో తెలంగాణ ధూంధాం వేదికల మీద అందెశ్రీ పాటలు తెలంగాణ పల్లె బతుకులను కళ్లకు కట్టేలా చూపాయి. చూడ చక్కని తల్లి చుక్కల్లో జాబిల్లి.. నవ్వుల్లో నాగమల్లి నా ఊరు పాలవెల్లి.. మళ్లీ జనమా ఉంటే సూరమ్మో.. మళ్లీ నీ కడుపున పుడతామమ్మో అంటూ తెలంగాణ పల్లె ఆత్మీయతను గొప్పగా ప్రదర్శించారు. సమాజం హితం కోసం అనేక రచనలు చేసి సాహితీ శిఖరంగా ఎదిగిన ఆయన నేడు తెలంగాణ గీతంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవనున్నారు. అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ పాట నేడు రాష్ట్రగీతంగా మారింది.

# 12 దేశాల్లోని ప్రవాసులూ పేటీఎం యాప్ వినియోగించుకోవచ్చు

వినియోగదార్ల చెల్లింపుల అనుభూతిని మరింతగా పెంచేందుకు, సరికొత్తగా పేటీఎం యాప్‌ను తీర్చిదిద్దినట్లు మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తెలిపింది. రోజు వారీ లావాదేవీల ప్రక్రియను సులభతరం చేసేందుకు, కృత్రిమ మేధ ప్రత్యేకతలను ఈ యాప్‌నకు జోడించింది. నవీకరించిన యాప్‌లో 15కి పైగా కొత్త సదుపాయాలను చేర్చింది. 12 దేశాల్లోని ప్రవాస భారతీయులు సహా దేశవ్యాప్తంగా వినియోగదార్లు తమ చెల్లింపులను వేగంగా చేసేందుకు ఇవి దోహదం చేస్తాయని వివరించింది. ప్రతి చెల్లింపుపై వినియోగదారులకు డిజిటల్ గోల్డ్ రూపేణా రివార్డులు ఇచ్చే సదుపాయాన్ని పేటీఎం తీసుకొచ్చింది. కృత్రిమ మేధను అనుసంధానం చేయడం వల్ల, వినియోగదార్ల చెల్లింపుల ధోరణులను అర్థం చేసుకోవడంతో పాటు, విడివిడిగా బ్యాంకు ఖాతాలను నమోదు చేసుకునే అవసరం లేకుండా.. యూపీఐ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోని మొత్తం నిల్వ వివరాలను వేగంగా వినియోగదార్లు తెలుసుకోవచ్చని పేటీఎం వివరించింది. మ్యాజిక్ పేస్ట్ సదుపాయం ద్వారా వాట్సప్ మెసేజ్‌లు, ఫేవరేట్ కాంటాక్టుల జాబితా నుంచి బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌ఐ వివరాలను ఆటోమేటిక్‌గా నింపుకోవచ్చని.. తద్వారా వేగంగా చెల్లింపులు చేసే వీలుంటుందని తెలిపింది.

# ఢిల్లీ పేలుడు ఘటన అత్యంత శోచనీయం తలపా దామోదరం రెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీ పేలుళ్ల ఘటన కు కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలియజేసిన కాంగ్రెస్ శ్రేణులు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ ఢిల్లీ పేలుళ్ల ఘటన యావత్ భారతదేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని,చనిపోయిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన ఉగ్రవాదులకు ప్రభుత్వం తగిన గుణపాఠం చెప్పాలని ఇట్టి సమయంలో యావత్ భారతదేశం ఒక్కటై ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెక్కిలించివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, మునికృష్ణయ్య, అజిత్, వినాయక, చరణ్, నాగరాజు, మహేష్, ప్రతాప్, జోసఫ్, సారధి, అల్లావుద్దీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మిడ్ మానేరు వద్ద విషాదం - బైక్, కారు ఢీకొని యువతి మృతి

- కేసు నమోదు - దర్యాప్తు - బోయినిపల్లి ఎస్సై : రమాకాంత్




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, కొదురుపాక మిడ్ మానేరు డ్యాం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి దుర్మరణం చెందింది. ఈ ఘటనలో కరీంనగర్ జిల్లా, చిగురుమామిడి మండలం, లంబాడిపల్లి గ్రామానికి చెందిన జెట్టి కళ్యాణి (25) మృతి చెందినదిగా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే ౹ నవంబర్ 9వ తేదీ సాయంత్రం 6.20 గంటల సమయంలో కళ్యాణి తన మేనబావ బరిగల శ్రీశైలంతో కలిసి పల్సర్ బైక్ (TS 02 FG 5926) పై మిడ్ మానేరు డ్యాం కట్ట ప్రాంతానికి వెళ్లి తిరిగి వస్తుండగా, కొదురుపాక గ్రామానికి సమీపంలో ఎదురుగా వచ్చిన నెక్సాన్ కారు (TS 23 F 5252) బైక్‌ను ఢీకొట్టింది.
ఆ కారు డ్రైవర్ బోయినిపల్లి మండలం, అనంతపల్లి గ్రామానికి చెందిన మీరాల శరత్ చంద్ర రెడ్డి అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వలన ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో బరిగల శ్రీశైలం, కళ్యాణి తీవ్రంగా గాయపడ్డారు. గాయాల తీవ్రతతో కళ్యాణిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నవంబర్ 10న రాత్రి 8.54 గంటలకు ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి జెట్టి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,విచారణ చేపట్టినట్లు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

# గంజి వాగు హై లెవల్ వంతెన పనులు పూర్తి చేయాలంటూ ప్రజల ఆగ్రహం

- ప్రభుత్వంపై కుల సంఘాల హెచ్చరిక
- 17వ తేదీన వంటవార్పు
- 24వ తేదీ నుండి నిరవధిక నిరాహార దీక్షలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో గంజి వాగు వద్ద కొన్నేళ్లుగా అసంపూర్తిగా ఉన్న హై లెవెల్ వంతెన నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని గ్రామ ప్రజలు, కుల సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ ౹ "వంతెన పనులు ప్రారంభించాలని ఇప్పటికే పాదయాత్రలు, బైక్ ర్యాలీలు, ప్రజావాణిలో వినతిపత్రాలు సమర్పించినా, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం" అని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం వస్తే గ్రామ ప్రజలు వాగు దాటలేక ఇబ్బందులు పడుతున్నారని, చిన్నపిల్లల విద్య,రోగుల రవాణా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు.

**- భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తూ**

నవంబర్ 17న గంజి వాగు వద్ద వంటవార్పు కార్యక్రమం, నవంబర్ 24 నుండి బోయినిపల్లి మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు నాయకులు ప్రకటించారు. ఈ సమావేశంలోగౌడ సంఘం అధ్యక్షులు పులి లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తునికి తిరుమలేష్, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు తంగళ్ళపల్లి సంతోష్, రెడ్డి సంఘం అధ్యక్షులు ముచ్చ లింగారెడ్డి, రజక సంఘం అధ్యక్షులు కోడూరు శంకరయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు అక్కనపల్లి శేఖర్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చిలుముల రమేష్, శాలివాహన సంఘం అధ్యక్షులు రాచర్ల రాజేష్, చంద్రగిరి పల్లె సంఘం ఉపాధ్యక్షులు చంద్రగిరి అంబేద్కర్ తదితరులు, అలాగే మాజీ సర్పంచ్ అక్కెనపల్లి జ్యోతి కరుణాకర్, మాజీ ఉపసర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్,కస్తూరి బాపురెడ్డి, అల్లూరి నరసింహారెడ్డి, అక్కెనపల్లి ప్రభాకర్, అజయ్ కుమార్, రమేష్, పొత్తూరి లచ్చయ్య, పరశురాములు, ముత్యపు ఎల్లయ్య, చంద్రగిరి శ్రీనివాస్,పులి లింబయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలు కాల్చవద్దు - పర్యావరణానికి, భూమికి హాని

- రైతులకు సూచనలు చేసిన మండల వ్యవసాయాధికారి : కె. ప్రణీత



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి ప్రణీత, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రజిత పర్యవేక్షణలో పంటల నమోదు పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మొత్తం 15 సర్వే నంబర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రణీత మాట్లాడుతూ "వరి కొయ్యలను కాల్చడం వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలు మాత్రమే కాకుండా పర్యావరణానికి తీవ్రమైన హాని కలుగుతుంది. పొలాల సారాన్ని తగ్గించడంతో పాటు గాలి,నేల కలుషితమవుతాయి. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతాయి. అందువల్ల వరి కొయ్యలను కాల్చకుండా వాటిని పొలంలో కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలి," అని సూచించారు. భూమిలో దున్నిన వరికొయ్యలు ఎరువుగా మారుతాయని, ఎకరానికి దాదాపు ఒక టన్ను సేంద్రియ ఎరువు లభిస్తుందని తెలిపారు. దున్నే ముందు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే కొయ్యలు త్వరగా కుళ్లిపోతాయని వివరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి,పంట దిగుబడిని పెంచే ఈ విధానం ప్రతి రైతు అనుసరించాలని సూచించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల నత్రజని, ఫాస్ఫరస్ వంటి పోషక పదార్థాల శాతం తగ్గి భూమి సారాన్ని కోల్పోతుందని హెచ్చరించారు. అనంతరం పంటల నమోదు పరిశీలనలో భాగంగా వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీదేవి,రవళి, అనూష రత్నంపేట, దేశాయిపల్లి, బూరుగుపల్లి, మాన్వాడ గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించారు.

# CA లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థి కీ సన్మానం



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) జూలూరుపాడు మండలపరిధిలోని పాపకొల్లు గ్రామానికి చెందిన బొడ్డు నాగేశ్వరరావు కుమారుడు బొడ్డు సతీష్ %జూా% లో ఉత్తీర్ణత సాధించినందుకు గాను మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు రామిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో సతీష్ ను సాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు స్టేట్ జాయింట్ సెక్రెటరీ బాపట్ల మురళి హాజరయ్యారు. వీరితోపాటు మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉసికల రమేష్ , జూలూరుపాడు మున్నూరు కాపు సంఘం కోశాధికారి రామిశెట్టి నాగేశ్వరరావు , మున్నూరు కాపు సంఘం నాయకులు రోకటి రమేష్, పాలెపు భద్రయ్య, అరిగెల నరసింహారావు, మునుపాటి అప్పారావు, మద్దిశెట్టి ప్రకాష్, పాపిన్ని వెంకయ్య, పాలెపు నాగయ్య, తదితరులు పాల్గొన్నారు

# వేములవాడ మైనారిటీ గురుకులంలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

- ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు గ్రహీత లక్ష్మీ నారాయణ కు అభినందనలు - శుభాకాంక్షలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా మైనారిటీ డే వేడుకలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల సందర్భంగా మైనారిటీ డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా




జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎం.ఎస్. భారతి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన ఆమె, వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఉత్సవాలలో భాగంగా ఉర్దూ దినోత్సవం కూడా నిర్వహించగా, ఉర్దూ ఉపాధ్యాయులు ఉస్మాన్ షా ఖాన్, రేహనా బేగంలను డిఎంవో భారతి ఘనంగా సత్కరించారు. ఇదే సందర్భంలో, హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర మైనారిటీ మంత్రి అజారుద్దీన్ చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్న వేములవాడ మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ పి. లక్ష్మీనారాయణను డిఎంవో, ఉపాధ్యాయులు,విద్యార్థులు ఘనంగా అభినందించారు. అనంతరం ఉపాధ్యాయ బృందం ముఖ్య అతిథి ఎం.ఎస్. భారతిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు అబ్దుల్ రజాక్ (జిల్లా లీడర్), సాహిద్, షబ్బీర్ (మైనార్టీ మీడియా లింక్ లీడర్) పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు.

# మానవతా సేవలో ముందున్న తోట లహరి

- అంత్యక్రియల అనంతరం భోజనం ఏర్పాటు
- అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవా సంస్థ నిర్వాహకులు : తోట లహరి



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఆకుల (రంగం) దేవయ్య మంగళవారం మృతిచెందిన నేపథ్యంలో, అంత్యక్రియల అనంతరం వారి కుటుంబ సభ్యులకు అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు తోట లహరి భోజనం పంపడం జరిగింది. భోజనం పంపించాలని ట్రస్ట్ నంబర్‌కి బుట్టం దేవరాజు, ఒడ్యాల భవాని ఫోన్ చేసి వివరించగా, సంస్థ నిర్వాహకులు తోట లహరి ఆధ్వర్యంలో భోజనం సకాలంలో కుటుంబ సభ్యులకు చేరవేయడం జరిగింది. ఈ సందర్భంగా తోట లహరి మాట్లాడుతూ "వేములవాడ పట్టణ పరిధిలో దురదృష్టవశాత్తూ ఎవరు మరణించినా, సంబంధిత వ్యక్తులు లేదా స్థానికులు మా ట్రస్ట్ నంబర్ 8919376459 కు సమాచారం అందిస్తే, ఆ కుటుంబ సభ్యులకు సకాలంలో ఉచితంగా భోజనం పంపిస్తాం" అని తెలిపారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో ముందుంటున్న అన్నపూర్ణ స్వచ్ఛంధ సేవ సంస్థ ఈ విధంగా మానవతా సేవను కొనసాగిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లపై ఎంపీడీవోలు రోజు సమీక్ష చేయాలి


- ఎంపీడీఓలు పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడాలి: ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై ఎంపీడీవోలు ప్రతి రోజు సమీక్ష చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై జిల్లాలోని జడ్పీ సీఈవో, ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, పీడీ హౌసింగ్ తో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.
సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని, దీనిలో భాగంగా లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నదని తెలిపారు. ఇండ్లు కట్టుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మహిళా సంఘాల సభ్యులకు డీఆర్డీఓ, మెప్మా నుంచి ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. ఇసుక ఇబ్బందులు ఉంటే తహసీల్దార్లతో ఆయా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మాట్లాడాలని ఆదేశించారు. తమ పరిధిలోని రీచ్ ల నుంచి ఇసుక తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఎంపీడీవో తమ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై రోజు టెలీ కాన్ఫరెన్స్ చేయాలని సూచించారు. పీడీ హౌసింగ్, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు తమ మండలాల్లో ఇండ్ల నిర్మాణాల పురోగతి పరిశీలించాలని ఆదేశించారు. హౌసింగ్, ఇతర అధికారులు తమ పరిధిలో ఇండ్ల ఫోటోలు తీసి ఆన్లైన్లో అప్ లోడ్ చేయాలని, పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించేం దుకు సిద్ధం చేయాలని సూచించారు. త్వరితగతిన తమ సొంత ఇంటి కలను పూర్తి చేసుకునేలా అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీల సభ్యులు ప్రోత్సహించాలని తెలియజేశారు.

# డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానాలు: ఇన్స్పెక్టర్ కృష్ణ

- మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు, తస్మాత్ జాగ్రత్త




**సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)** పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 77 మంది మందు బాబులు పట్టుబడగా వారిని సిరిసిల్ల పట్టణ పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా 77 మంది మందు బాబులకు జరిమానాలు విధిస్తు మేజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు. 03కి ఒక్కొక్కరికి 6000/- రూపాయలు జరిమానా. 25 మందికి ఒక్కోక్కరికి 5000/- రూపాయల జరిమాన. ఇద్దరికి ఒక్కొక్కరికి 1500/- రూపాయల జరిమన. 47 మందికి ఒక్కొక్కరికి 1000 రూపాయల జరిమానా. సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లోపట్టుబడిన మందు బాబులకు పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ ప్రతి రోజు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించాడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడిన వారికి వారి తల్లితండ్రుల, కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెల్లింగ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరైఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతయని, ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇండస్ట్రీలో తీవ్ర విషాదం.. ప్రముఖ హీరో కన్నుమూత



వరుస విషాదాలతో ఇండస్ట్రీలోని సెలబ్రిటీలు ఒక్కరొక్కరిగా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోతున్నారు. గత కొద్ది రోజులగా చాలామంది సడెన్‌గా గుండెపోటుతో మరణిస్తుంటే.. మరికొందరు అనారోగ్య సమస్యలు తలెత్తి ఆదుకునే వాళ్ళు లేక కొందరు చనిపోతున్నారు. తాజాగా, ఇండస్ట్రీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తమిళ హీరో అభినయ్ కింగర్ తుదిశ్వాస విడిచాడు. కొన్నేళ్లుగా కాలేయ వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ సోమవారం ప్రాణాలు కొల్పోయారు. ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్ అవుతుండగా.. ఈ విషయం తెలుసుకున్న వారంతా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. అరుముగ్, ఆరోహణం, సక్సెస్ వంటి చిత్రాల్లో నటించిన ఆయన చివరగా 'వల్ల వణుక్కు పుల్లం ఆయుధం' చిత్రంలో కనిపించారు. ఆ తర్వాత పూర్తిగా సినిమాలకు దూరం అయి తన అనారోగ్యానికి చికిత్స తీసుకున్నారు. ఇక ఇటీవల తన మరణాన్ని అంచనా వేస్తూ ఓ వీడియో కూడా షేర్ చేశాడు. అందులో ఏడాదిన్నర మాత్రమే బుతుకుతానని డాక్టర్లు చెప్పారని చెప్పాడు. ఈ వీడియో వచ్చిన మూడు నెలలకే మరణించడం గమనార్హం. ఆరోగ్యం క్షీణించడం వల్లే ప్రాణాలు కోల్పోయాడు.

# ఆ సీనియర్ హీరో మోసగాడు అన్న భార్య



బాలీవుడ్ సీనియర్ హీరోల్లో ఒకరైన గోవిందాకు, ఆయన భార్య సునీత ఆహూజాకు మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నట్లు, ఇద్దరూ విడాకులు తీసుకుంటున్నట్లు కొన్ని నెలల ముందు వార్తలు రావడం తెలిసిందే. గతంలోనూ ఇద్దరూ విడిపోతున్నట్లు ప్రచారం జరిగింది. కానీ గొడవ సద్దుమణగడంతో వారి వివాహ బంధం సాఫీగానే సాగిపోతోందని అన్నుకన్నారు. కానీ ఈసారి వ్యవహారం సీరియస్‌గానే ఉన్నట్లు కనిపిస్తోంది. సునీత విడాకుల పిటిషన్ కూడా ఫైల్ చేసినట్లు తెలుస్తోంది. గోవిందా మోసగాడని, అక్రమ సంబంధాలు పెట్టుకున్నాడని.. తనపై గృహ హింసకు పాల్పడ్డాడని ఆమె ఆరోపించినట్లు ఇంతకుముందు వార్తలు రాగా.. గోవిందా లాయర్ ఆ ప్రచారాన్ని ఖండించారు. కానీ తర్వాత ఏమైందో స్పష్టత లేదు. కానీ ఇప్పుడు సునీతా ఆహూజా తన భర్త మీద బహిరంగంగా తీవ్ర ఆరోపణలు చేసింది. ఆయన్ని మోసగాడిగా అభివర్ణించింది. "చిన్నతనంలో అందరూ తప్పులు చేస్తారు. అది సహజం. నేను కూడా చాలా తప్పులు చేశాను. గోవిందా కూడా చేశాడు. కానీ ఒక వయసు వచ్చాక కూడా తప్పులు చేస్తూనే ఉంటే ఎలా? మీకు భార్య, పిల్లలు ఉన్నపుడు ఎందుకు అలాంటి తప్పులు చేస్తున్నారు? నిజం చెబుతున్నాను. గోవిందా తన జీవితంలో భార్య కంటే తన హీరోయిన్లతోనే ఎక్కువ గడిపాడు. మొదట్లో నాకు ఏమీ అర్థం కాలేదు. అన్నీ తెలిసేసరికి జీవితం చాలా ముందుకు వచ్చేసింది" అని సునీత కుండబద్దలు కొట్టేసింది. గోవిందా అక్రమ సంబంధాల విషయంలోనూ సునీత ముందు నుంచి గొడవ చేస్తున్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయి.

# ప్రతి దాంట్లో నేర్చుకునే విషయం ఉంటుంది




బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ అడపా దడపా చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తోంది. రాజకీయాల్లో ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్న కంగనా నాయకులకు తనదైన స్టైల్లో వార్నింగ్‌లు ఇస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులతో టచ్‌లో ఉంటుంది. తనకు ఏది అనిపిస్తే అది ధైర్యం చెబుతూ వార్తల్లో నిలుస్తుంటుంది. తాజాగా, కంగనా సోషల్ మీడియా ద్వారా అభిమానులతో చిట్ చాట్ చేసింది. ఇందులో భాగంగా వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ఆశ్చర్యపరిచింది. మీకు రాజకీయాలంటే ఇష్టమా సినిమాలా? అని అడగ్గా.. "మనిషి జీవితంలో ఒక్క విషయాన్ని మాత్రమే ఇష్టం పడాల్సిన పనిలేదు. కాలం మారితే మన అభిరుచులు కూడా మారుతాయి. ప్రతి దాంట్లో నేర్చుకునే విషయం ఉంటుంది. నాకు రాజకీయాలు, సినిమాలు రెండూ సమానమే. ఏది ఇష్టమంటే చెప్పలేను. ఇంకోసారి ఇలాంటి ప్రశ్నలు అడగడం మానుకోండి" అని చెప్పింది. ఇక మరో నెటిజన్ మళ్లీ సినిమాల్లో కనిపిస్తారా.. లేక పూర్తిగా దూరం అవుతారా? అని అడగ్గా.. దానికి కంగనా"ఓ కథపై ప్రస్తుతం వర్క్ జరుగుతోంది.

# ప్రభాస్ హీరోయిన్లకు ఇది మామూలే




పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్‌తో పని చేసిన వాళ్లందరూ అతడి గురించి సోషల్ మీడియాలో లేదా ఇంటర్వ్యూల్లో కచ్చితంగా చెప్పే విషయం ఒకటుంటుంది. అదే.. తమ ఇంటి వంటలతో అతను అందించే విందు. తాను పని చేసే యూనిట్లో దాదాపుగా ముఖ్యులందరికీ తమ ఇంటి వంటలు రుచి చూపించకుండా ఉండడు ప్రభాస్. ప్రభాస్ వల్ల తమ డైట్ ప్లాన్లు దెబ్బ తిన్నాయని.. కడుపు ఉబ్బిపోయేలా తిండి పెట్టి చంపేస్తాడని సరదాగా వ్యాఖ్యానిస్తుంటారు కోస్టార్లు. ఈ జాబితాలోకి కొత్తగా ఇంకో పేరు చేరింది. 'ఫౌజీ' సినిమా కోసం ప్రభాస్‌తో జట్టు కట్టిన కొత్త కథానాయిక ఇమాన్వి కూడా ప్రభాస్ ఫుడ్ లవ్‌ను రుచి చూసింది. దీని మీద మాండేటరీ పోస్టు పెట్టేసింది. 'ఫౌజీ' షూటింగ్ టైంలో ప్రభాస్ ఇంటి నుంచి తెప్పించి వడ్డించిన నాన్ వెజ్, వెజ్ వంటకాలను వీడియో తీసి తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో షేర్ చేసిన ఇమాన్వి.. కడుపు పేలిపోయేలా ఈ వంటకాలను తిన్నట్లు కామెంట్ చేసింది. ఇలా ఎంతోమంది ఆర్టిస్టులు, టెక్నీషియన్లు ప్రభాస్ ఇంటి వంటకాలు తిని బాబోయ్ అన్న వాళ్లే. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అయిన ఇమాన్వి తన వీడియోలతోనే 'ఫౌజీ' దర్శకుడు హను రాఘవపూడి కళ్లలో పడింది. ఇలాంటి నేపథ్యం ఉన్న కొత్త అమ్మాయిని ప్రభాస్ లాంటి టాప్ స్టార్‌కు జోడీగా తీసుకోవడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. ఐతే ఇమాన్వి టాలెంట్ తెలిసిన వాళ్లు.. తనేంటో 'ఫౌజీ' సినిమా రిలీజైనపుడు తెలుస్తుందని అంటున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ప్రేక్షకుల ముందుకు వస్తుంది. 1930-40 మధ్య నేపథ్యంతో తెరకెక్కుతోంది.

# మహాశయా.. సరైన దారికి వచ్చారు



మాస్ మహారాజా రవితేజ గత కొన్నేళ్లుగా చేస్తున్న మాస్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద అడ్డంగా బోల్తా కొడుతున్నాయి. ఒక్క ధమాకా తప్ప మిగిలినవన్నీ తీవ్రంగా నిరాశ పరిచాయి. ఇటీవలే వచ్చిన మాస్ జాతర మరీ అన్యాయం. ప్రీమియర్ షో నుంచే నెగటివ్ టాక్ మూటగట్టుకుంది. అయినా సరే నిన్న వీకెండ్ మెయిన్ సెంటర్స్ లో హౌస్ ఫుల్స్ నమోదు చేయడం చూస్తే జనం మాస్ ఎంటర్ టైనర్స్ కోసం ఎంతగా కరువులో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ ఇది కనక బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకుని ఉంటే కనీసం రెండు వారాలు భారీ నెంబర్లు నమోదయ్యేవి. మంచి అవకాశం చేతులారా వృథా అయ్యింది. ఇది పక్కనపెడితే రవితేజ కొత్త సినిమా భర్త మహాశయులకు విజ్ఞప్తి సంక్రాంతి విడుదలకు రెడీ అవుతోంది. టైటిల్ రివీల్ సందర్భంగా చిన్న టీజర్ వదిలారు. అందులో కాన్సెప్ట్ ఏంటో చెప్పారు. ఇద్దరు అమ్మాయిలు జీవితంలో ఉన్న ఒక ఉద్యోగికి పెద్ద సంకటం వచ్చి పడుతుంది. ఎవరిని అడిగినా ఆఖరికి ఏఐ టెక్నాలజీ వాడినా సమాధానం దొరకదు. అసలా ప్రశ్న ఏంటి, అతను ఎదురుకున్న ఆ ఇబ్బంది ఏంటనేది తెరమీద చూడాలి. తన రెగ్యులర్ స్టైల్‌కి భిన్నంగా రవితేజ పూర్తిగా క్లాస్ టచ్ తీసుకున్నాడు. ఆశికా రంగనాథ్, డింపుల్ హయాతి మధ్య నలిగిపోయే నారీనారీ నడుమ మురారిగా అలరించబోతున్నాడు. ఇప్పుడీ మార్పు మంచిదే. ఎందుకంటే ఫ్యామిలీ ఆడియన్స్ కి మళ్ళీ దగ్గరవ్వాలంటే ఇలాంటి కథలే ఎంచుకోవాలి. వరస ఫ్లాపులు తన మార్కెట్ ని ప్రభావితం చేసి ఉండొచ్చేమో కానీ ఇమేజ్ ని కాదు. సో భర్త మహాశయులకు విజ్ఞప్తి మంచి నిర్ణయమే కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ ఎంటర్ టైనర్ లో పెద్ద క్యాస్టింగే ఉంది.

# లెజెండరీ యాక్టర్ ధర్మేంద్ర కన్నుమూత..



ఇండస్ట్రీలో వరుస విషాదాలు చోటుచేసుకుంటూ అభిమానులకు శోకసంద్రంలోకి నెడుతున్నాయి. అందెశ్రీ మరణం మరవక ముందే.. ఇండస్ట్రీలో మరో విషాదం చోటుచేసుకుంది. లెజెండరీ నటుడు ధర్మేంద్ర (89) కన్నుమూశారు. శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ముంబయిలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న సినీ సెలబ్రిటీలు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఇండస్ట్రీల్లో ఏదో అయింది.. అందుకే అంతా సడెన్‌గా చనిపోతున్నారని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఆయనకు ఇద్దరు భార్యలు ప్రకాష్ కౌర్, హేమమాలిని. బాలీవుడ్ నటులు సన్నీ డియోల్, బాబీ డియోల్ తొలి భార్య సంతానం. ధర్మేంద్ర సినిమాల విషయానికొస్తే.. అత్యంత ప్రాచుర్యం పొందిన 'షోలే'లో వీరూ పాత్రలో ధర్మేంద్ర నటించారు. అలీబాబా ఔర్ 40 చోర్, దోస్త్, డ్రీమ్ గర్ల్, సన్నీ, గాయల్, లోఫర్, మేరా నామ్ జోకర్ తదితర చిత్రాల్లోనూ నటించారు. 2024లో విడుదలైన 'తేరీ బాటన్ మే ఐసా ఉల్జా జియా' (%ఖతీఅ దీుఖ్శీఅ వీవఅఅ ాఅయి ఖశ్రీయష్ట్ర జీఅఖ%) సినిమాలో కనిపించారు. అంతేకాకుండా ఆయన చివరగా ఆగస్య నందా 'ఇక్కిస్' (%×ఎఎఅం%)చిత్రం ఈ ఏడాది డిసెంబర్ 25న థియేటర్స్‌లోకి రాబోతుంది.



# సారీ చెప్పినా క్షమించని హీరోయిన్

తెలుగులో 'శ్రీదేవి శోభన్ బాబు' అనే సినిమాలో నటించిన తమిళ కథానాయిక గౌరి కిషన్ పేరు ఇటీవల సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఒక సినిమా ప్రమోషన్ కోసం మీడియాను కలిసిన ఆమెను.. ఆర్.ఎస్.కార్తీక్ అనే సీనియర్ తమిళ సినీ జర్నలిస్టు అడిగిన ప్రశ్న దుమారం రేపింది. మీ బరువు ఎంత.. ఈ మధ్య వెయిట్ పెరిగినట్లున్నారే అని ఆ జర్నలిస్టు అడగ్గా.. నేనెందుకు నా వెయిట్ చెప్పాలి అంటూ ఆమె ఫైర్ అయింది. ఇది అసలు జర్నలిజమే కాదంటూ ఆమె ఆ జర్నలిస్టుతో చాలా సేపు వాగ్వాదానికి దిగింది. ఆ జర్నలిస్టు కూడా గట్టిగానే ఎదురుదాడి చేశాడు. ఐతే సోషల్ మీడియా పూర్తిగా గౌరి వైపే నిలిచింది. ఇవేం ప్రశ్నలు అంటూ ఆ జర్నలిస్టు తీరును అందరూ దుయ్యబట్టారు. అలాంటి ప్రశ్నలు అడగడమే తప్పంటే.. మళ్లీ వాదించడమా అంటూ ఆయన్ని నిలదీశారు. ఈ విషయమై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ జర్నలిస్టు గౌరి కిషన్‌కు సారీ చెబుతూ ఒక వీడియో కూడా చేయాల్సి వచ్చింది.కానీ బేషరతుగా క్షమాపణ చెప్పకుండా.. తన ప్రశ్నను తప్పుగా అర్థం చేసుకున్నారంటూ ఆయన ఈ వివరణలో పేర్కొన్నాడు. దీంతో గౌరి కిషన్‌కు ఇంకా కోపం వచ్చింది. ఇదసలు క్షమాపణ లాగే లేదని.. దీన్ని తాను అంగీకరించనని ఆమె తేల్చి చెప్పింది. ఆయన ప్రశ్నను తప్పుగా అర్థం చేసుకున్నానని చెప్పడం.. బాడీ షేమింగ్ చేయలేదు అనడం.. అది సరదాగా అన్న ప్రశ్న అనడంపై ఆమె అభ్యంతరం వ్యక్త ంచేసింది. ఇంకా బెటర్‌గా ట్రై చేయండి కార్తీక్ అంటూ ఘాటుగా బదులిచ్చింది గౌరి కిషన్.

# అనీత్ పడ్డాపై ప్రశంసలు కురిపిస్తున్న ఫ్యాన్స్

'సైయారా' సినిమాతో ఇండస్ట్రీలో క్రేజీ బ్యూటీగా మారిపోయింది బాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనీత్ పడ్డా. ఈ చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకున్న ఈ అమ్మడు ఫుల్ ఈమేజ్‌ను సొంతం చేసుకుని వరుస మూవీ ఆఫర్స్ అందుకుంటుంది. ఇక ఎన్ని సినిమా ఆఫర్స్ వస్తున్నప్పటికీ ఈ హీరోయిన్ చదువులో కూడా యాక్టీవ్‌గా ఉన్నట్లు టాక్. అయితే మొదట లవ్ స్టోరీతో ఆకట్టుకున్న అనీత్ ఇప్పుడు తన రెండో ప్రాజెక్ట్ ఓ హారర్ మూవీతో రాబోతున్నట్లు టాక్. దినేష్ విజయన్ నిర్మాణంలో తెరకెక్కుతోన్న 'శక్తి శాలిని'లో అనీత్ పడ్డా హీరోయిన్ కాగా.. ఈ సినిమా వచ్చే ఏడాది డిసెంబర్ 24న విడుదల అయ్యేందుకు సిద్ధం అవుతుందని తెలుస్తుండగా.. ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటూనే తన తన కళాశాల చివరి సంవత్సరం పరీక్షలకు హాజరు కానుందని టాక్. రాజకీయ శాస్త్రంలో బి.ఎ. చదువుతున్న అనీత్.. ప్రస్తుతం చదువు, నటన రెండింటికీ సమాన శ్రద్ధ చూపుతోందనే వార్తలు వైరల్ కావడంతో.. ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు.



# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వేములవాడ విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

- ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్‌లో ఉప్పుల పవన్ రాజ్‌కు గ్రాండ్ టైటిల్
-విద్యార్థులు ప్రతీ ఏటా జాతీయస్థాయిలో ప్రసంశలు పొందడం హర్షణీయం
- ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్ : అబ్దుల్ మన్నాన్



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణానికి గర్వకారణంగా నిలిచారు ఒకినవా స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థులు. ఇటీవల కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో సి.ఎస్.కె.ఐ ఫౌండర్ ఈ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఈ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు.జూనియర్ ఓపెన్ కుమ్మితే విభాగంలో ఉప్పుల పవన్ రాజ్ గ్రాండ్ ఛాంపియన్షిప్ సాధించి అన్ని వర్గాల ప్రశంసలు పొందారు. అదే పోటీల్లో నాంపల్లి రిశ్విన్ బంగారు పతకం, బొడిగె క్రాంతి కుమార్, బి. భవ్యష్, సరస్వతి, సిహెచ్. సూర్య జయచంద్ర, ఎల్. రానా విరాట్ లు వెండి పతకాలు దక్కించుకున్నారు. సిద్ధు,బి. దీవెర్ష్,జి.విగ్నయ్య, జి. వేదనశీ, పి. కార్తీక్, ఎన్. సన్మయ లు కాంస్య పతకాలు సాధించారు.ఈ సందర్భంగా ఒకినవా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్ అబ్దుల్ మన్నన్ మాట్లాడుతూ, “వేములవాడ విద్యార్థులు ప్రతీ ఏడాది తమ ప్రతిభతో జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటున్నారు. ఇది విద్యార్థుల కృషికి, తల్లిదండ్రుల ప్రోత్సాహానికి నిదర్శనం” అని తెలిపారు. విజేతలను ఒకినవా డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కె. వసంత్ కుమార్, సీనియర్ మాస్టర్లు మొండయ్య, సంపత్ కుమార్, సురభి వేణుగోపాల్, రాజిరెడ్డి, లింగయ్య,టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ఈ. శ్రీనివాస్,అలాగే వేములవాడ ఇన్స్ట్రక్టర్లు కనికరపు రాజశేఖర్, ఎం. తిరుపతి,లోలోపు రాజు తదితరులు ఘనంగా అభినందించారు. ఈ విజయంతో వేములవాడ విద్యార్థులు కరాటే రంగంలో మరొక సువర్ణ పుటను సృష్టించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్.!



తల్లాడ, నవంబర్ 11 (ప్రశ్నన్యూస్) : మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సెంటర్ నిర్వాహకులకు పలు సూచనలు ఆదేశాలు ఇచ్చారు అలాగే రైతులను ధాన్యం కొనుగోలు ఏ విధంగా జరుగుతున్నది నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని అమ్ముతున్నారా లేదా ధాన్యాన్ని శుభ్రపరిచే విధానం పైన రైతులను అడిగి తెలుసుకున్నారు మండలంలోని అన్ని కేంద్రాలలో ఎలాంటి సమస్యలు లేకుండా రైతులు వద్ద నుండి కొనుగోలు చేసి కేటాయించిన మిల్లులకు పంపాలని బిల్లులనుండి వెంటనే రసీదులు పొంది ట్యాబ్ ఎంట్రీ చేసి రైతులకు 48 గంటల్లో ఆన్లైన్ చేసే విధంగా పని చేయాలని సూచించారు రంగం బంజర ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా కొనుగోలు చేయాలని మాయిశ్చర్ సరిగా వచ్చిన తర్వాతే రైతుల తరపున హమాలీలకు గన్ని బ్యాగులను ఇచ్చి కాటాలు వేసి మిల్లులకు పంపాలని ఆదేశించారు ఏ రోజు పూర్తయిన రైతుల వివరాలను అదే రోజు పుస్తక నిర్వహణ చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ శ్రీలత జిల్లా సివిల్ సప్లై అధికారి, మండల వ్యవసాయ అధికారులు తాజుద్దీన్, ఏఈఓ త్రివేణి, మండల రెవెన్యూ అధికారులు ఏపీఎం రవికుమార్, సిసి సీతా మహాలక్ష్మి, సెంటర్ నిర్వాహకులు రైతులు పాల్గొన్నారు.

# రాంమ్మూర్తికే బిఆర్ఎస్ మండల అధ్యక్ష పదవి..!



(ప్రశ్నన్యూస్), జూలూరుపాడు: బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు కేటీర్ ఆదేశానుసారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఖాళీగా ఉన్న బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష పదవులకు జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు కొత్త అధ్యక్షులు నియమించారు అందులో భాగంగా జూలూరుపాడు మండలంలో పార్టీ కోసం పనిచేసిన ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన చాపల మడుగు రామ్మూర్తిని నియమించారు. రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ ఆదేశానుసారము కొంతకాలం ఆ కమిటీని రద్దు చేశారు. తాజాగా ఖాళీగా ఉన్న మండలాల్లో అధ్యక్షులని నియమించండని బిఆరఎస్ రాష్ట్ర నాయకత్వం ఆదేశించడంతో ఈ పదవి మరలా చాపల మడుగు రామ్మూర్తికే వరించింది. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ మాట్లాడుతూ జూలూరుపాడు మండల అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పజెప్పిన కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు, ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు తాతా మధుసూదన్, రేగా కాంతారావు, యల్లంకి సత్యనారాయణ, గిరిబాబు లకు రుణపడి ఉంటానని తెలుపుతూ. జూలూరుపాడు మండల ప్రజల్లోకి మరింత విస్తృతంగా పార్టీని తీసుకెళ్లేందుకు, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత ఉత్సాహంగా కొనసాగించి రాబోయే లోకల్ ఎలక్షన్లలో బీఆర్ఎస్ ను ముందు వరుసలో ఉంచుతా నన్నారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నాకు ఈ బాధ్యతను ఇచ్చినందుకు మండల వ్యాప్తంగా దృఢనిబద్ధతను కలిగి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, చాపల మడుగు రామ్మూర్తి కీ అభినందనలు తెలిపారు.

# విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పేరెంట్స్ కమిటి చైర్మన్ దార మధు కు ఘన సన్మానం

మంథని ప్రిన్సిపాల్ శ్రీనాథ్



మంథని( ప్రశ్న న్యూస్) మంథని పట్టణం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల బాలురు లో ప్రిన్సిపాల్ శ్రీనాథ్ అధ్యక్షతన ఈ నెల 10న విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. ఇటివల 11 వ కాళేశ్వరం జోనల్ స్థాయి జోనల్ మీట్ ఆటల పోటిలు జాకారం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాల కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనాథ్ మాట్లాడుతూ.... జాకారంలో జరిగిన జోనల్ ఆటలకు గత సంవత్సరం, ఈ సంవత్సరం పేరెంట్స్ కమిటి చైర్మన్ క్రీడలకు హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. అయితే 11 గురుకులాల క్రీడాకారులు హాజరు కావడం జరిగినది. గతంలో గాని, ఈ సంవత్సరం గాని ఏ పాఠశాల పేరెంట్స్ కమిటి వారు ఎవరు రాలేదన్నారు. కానీ మన మంథని గురుకుల పేరెంట్స్ కమిటి చైర్మన్ హాజరు కావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు మన గురుకుల పాఠశాల నుంచి ఘన సన్మానం చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు అండగా ఉంటూ అటు చదువైన, ఆటలైన అన్నింట్లో ప్రోత్సహిస్తున్న దార మధు సేవలు గొప్పవి అన్నారు. అలాగే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సమస్యలు వచ్చిన అండగా ఉంటు ప్రభుత్వంతో, మంత్రులతో మాట్లాడుతూ.. వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం గొప్ప విషయం అన్నారు. ఇలాంటి పేరెంట్స్ కమిటి చైర్మన్ గురుకులాల్లో ఉంటే ఆ పాఠశాల కళాశాలలు అభివృద్ధి బాటలో ముందు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ నవీన్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రవి, సీనియర్ అధ్యాపకులు సరిత, పి డి రమేష్, పి ఈ టి పుష్పలత, బోధన, బోధనేతర, పేరెంట్స్ కమిటి సహాయకార్యదర్శులు జంజర్ల శ్రీనివాస్, నల్లి సతీశ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీపాద కాలనీ లో అదనంగా భూమి కబ్జా చేసిన ఎండి.మజీద్ పై చర్యలు తీసుకోవాలి.

అధికారులకు ఫిర్యాదు చేసిన నాయిని సంతోష్



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని శ్రీపాద కాలనీలో అదనంగా భూమి కబ్జా చేసిన ఎండీ మజీద్ పై చర్యలు తీసుకోవాలని మంథనిలోని బోయినపేటకు చెందిన నాయిని సంతోష్ మంగళవారం అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపాద కాలనీ ఒకటో వార్డు లో ఎండీ మజీద్ అక్రమంగా భూమి కబ్జా చేసి నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఇందిరమ్మ ఇంటి పట్టా కు 121 గజాలు మాత్రమే అధికారులు ఇచ్చారని, కానీ మజీద్ 363 గజాలు కబ్జా చేసి కాంపౌండ్ గోడ కట్టడం జరిగిందని మంథని ఆర్డీఓ సురేష్,, మున్సిపల్ కమిషనర్ మనోహర్.. తహసిల్దార్ కుమారస్వామి తో పాటు ఇతర అధికారులకు ఫిర్యాదు లో సంతోష్ పేర్కొన్నారు. కబ్జా చేసిన విలువైన భూమిని అధికారులు స్వాధీనం చేసుకోని మజీద్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సంతోష్ అధికారులను కోరారు.

# రాజన్న సేవలో టీబీసీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాయిని భరత్ - అఖిల నవ దంపతులు

- ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి - నాయిని భరత్



వేములవాడ.(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయిని భరత్ - అఖిల వివాహం ఇటీవల ఘనంగా జరిగింది. వివాహానంతరం మంగళవారం తొలిసారిగా నవ దంపతులు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నూతన దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా నాయిని భరత్ మాట్లాడుతూ రాజన్న దివ్యాశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



# విద్యార్థులకు కొండంత అండగా సింహ వాహిని ఫౌండేషన్




పటాన్ చెరు (ప్రశ్న న్యూస్)పటాన్ చెరు విద్యానికేతన్ హైస్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న ఒక బాలుడి ఫీజు కోసం ఆ బాలుడి కుటుంబం ఫౌండేషన్‌ను సంప్రదించింది. బాలుడి తండ్రి దృష్టి లోపంతో బాధపడుతూ చిన్న పింఛన్ మీద జీవనం సాగిస్తున్నారు. తల్లి రోజు వారి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.ఈ నేపథ్యంలో సంబంధిత పాఠశాలలో ?10,000 రూపాయలలు ఫీజును సింహ వాహిని ఫౌండేషన్ సభ్యుడు హరేష్ రెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వంశీ రెడ్డి మరియు సభ్యులు పాల్గొన్నారు.ఫౌండేషన్ అధ్యక్షులు వంశీ రెడ్డి మాట్లాడుతూ – “విద్యే భవిష్యత్తు అనే నమ్మకంతో ప్రతి చిన్నారికి అండగా నిలుస్తున్నాం. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ చిన్నారి చదువు ఆగకూడదనే లక్ష్యంతో మా ఫౌండేషన్ పనిచేస్తోంది” అని తెలిపారు.

# గిరిజనులకు ఆధార్ కార్డ్ సెంటర్ ప్రారంభం

గిరిజన సలహా మండలి సభ్యుడు సుబ్బయ్య



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) స్వాతంత్ర సమరయోధుడు గిరిజన ముద్దుబిడ్డ భీర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా పుత్తూరు నియోజకవర్గం గోపాల కృష్ణాపురం ఎస్టి కాలనీ నందు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిశ నిర్దేశముతో స్థానిక ఎమ్మెల్యే భాను ప్రకాష్ నాయుడు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య తిరుపతి జిల్లా గిరిజన అధికారి బి రాజు సోము ఆధ్వర్యంలో ఆధార్ కార్డ్ క్యాంప్ సెంటర్ ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక గిరిజనులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 108 వాహనాన్ని సందర్శించిన నేషనల్ హైవే అధికారులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని గుండ్ల పోచంపల్లి ప్రాంతంలో ఉంటున్న 108 వాహనాన్ని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా బృందం వారు సందర్శించి అంబులెన్స్ పని తీరు ను పరిశీలించారు. అత్యవసర వైద్య పరికరాల పని తీరును తెలుసుకున్నారు, అంబులెన్స్ లో ఉన్న అత్యవసర ఔషాదాల వాడకాన్ని పరిశీలించారు , అంబులెన్స్ లో ఉన్న అత్యవసర పరికరాల లిస్టు వాటి పనితీరును పరీక్షించి వారు సంతృప్తి వ్యక్తం చేశారు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు సరైన సమయంలో చికిత్స అందించడం కోరకు ప్రభుత్వం, మరియు ఏమరి గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో అన్నీ రకాల పరికరాలను సమకూర్చి పెట్టుకున్నారని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా బృందం వారు తెలిపారు ఈ కార్యక్రమములో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా బృందం అధికారి శివకుమార్ మేడ్చల్ జిల్లా 108 కోఆర్డినేటర్ తిరుపతి,గుండ్ల పోచంపల్లి 108 సిబ్బంది పాల్గొన్నారు.

# అనారోగ్యంతో తాళ్ళ సంజీవరెడ్డి మృతి

శ్రీ శివ్వంపేట పోచమ్మ-మైసమ్మ ఆలయ చైర్మన్ గా విశేషంగా సేవలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తాళ్ళ సంజీవరెడ్డి అనారోగ్యంతో తన స్వగృహంలో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం మరణించారు. గ్రామంలోని శ్రీ శివ్వంపేట పోచమ్మ-మైసమ్మ ఆలయ చైర్మన్ గా గత 20 ఏళ్లుగా కొనసాగుతూ ఆలయ అభివృద్ధికి విశేషంగా సేవలు అందించారు. దీంతో పాటు ఎల్లంపేట పురకపాలక సంఘం పరిధిలోని ఘనపూర్ గ్రామంలో గల మెడిసిటీ ఆస్పత్రి సమీపంలోని ఉన్న గుట్టపై రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. దీంతోపాటు అక్కడే ప్రతి సంవత్సరం మహా శివరాత్రి మరుసటి రోజు భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాన్ని గత కొన్ని సంవత్సరాలుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలోని అంతర్గత భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి అప్పటి మింట్ అధికారి రాములుతో మాట్లాడి నిధులు మంజూరు చేయించిన ఘనత వారికి దక్కుతుందని పలువురు గ్రామస్తులు కొనియాడారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన వారి అంతక్రియలలో గ్రామ మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చీకటిని అలుముకుంటున్న రోడ్లు

## కాంతి తగ్గిన ఎల్ఈడి లైట్లు

- చీకట్ల ప్రమాదాల ముప్పులో గ్రేటర్ హైదరాబాద్
- ఉన్న లైట్లు కాంతిని ఇవ్వవు, కొన్ని లైట్లు అసలే వెలగవు
- ప్రజల భద్రతకు ముప్పుగా మారిన మున్సిపల్ శాఖ నిర్లక్ష్యం
- వీధి దీపాల నిర్వహణలో ఉన్నత అధికారుల నిర్లక్ష్యం



(ఆర్ కె – ప్రశ్న న్యూస్ బ్యూరో)



పగటి వేళల్లో ఆర్భాటంగా మెరుస్తున్న హైదరాబాద్ నగరం,రాత్రివేళల్లో మాత్రం చీకటి ముసుగులో కనిపిస్తోంది. ఒక్కో వీధిలోకి అడుగుపెడితే చీకటి చిమ్ముకుంటున్న దృశ్యాలు, దారితప్పే ప్రయాణీకులు, వాహనాల వెలుగులోనే ముందుకు సాగుతున్న వాహనాలు కనిపించడం ఇప్పుడు సాధారణం అయిపోయింది.

### ఎల్ఈడి లైట్లు - కాంతి తగ్గి, చీకటి పెరిగింది..

నగరంలోని వీధి దీపాలను ఆధునికత పేరుతో ఎల్ఈడి లైట్లతో మార్చిన మున్సిపల్ శాఖ అధికారులు ఇప్పుడు వాటి సంరక్షణను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రారంభంలో చక్కగా వెలిగిన లైట్లు ఇప్పుడు రోజురోజుకూ కాంతిని పూర్తిగా కోల్పోతూ ఉన్నాయి. చాలావరకు దీపాలు పూర్తిగా వెలగడం మానేయగా, కొన్ని లైట్లు రాత్రి మధ్యలో ఆరిపోతున్నాయి.

చాలా ప్రాంతాల్లో లైట్లు పనిలో లేకపోయినా, వాటి బిల్లులు మాత్రం రెగ్యులర్గా చెల్లింపులు జరుగుతున్నాయన్నది ప్రజల ఆవేదన. ఎల్ఈడి ప్రాజెక్టు కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసిన జీహెచ్ఎంసీ అధికారులు ఇప్పుడు వాటి నిర్వహణపై మాత్రం కనీస శ్రద్ధ చూపడం లేదు. దానితో కాలనీలు, బస్తీలు, చివరికి రహదారులు కూడా చీకట్లను కమ్ముకుంటున్నాయి.

### ప్రమాదాలకు కేంద్రాలైన చీకటి రోడ్లు..

వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటిలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. రాత్రి పూట రెండు చక్రాల వాహనదారులు, మహిళలు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొన్నిచోట్ల చీకటిని ఉపయోగించుకుని దొంగతనాలు, గొలుసు లాగింపులు జరుగుతుంటాయి. ముఖ్యంగా మల్కాజిగిరి, కూకట్పల్లి, చందానగర్, పటాన్చెరు, ఉప్పల్, సికింద్రాబాద్, ఫలక్నుమా, ఎల్బీనగర్ ప్రాంతాల్లో రాత్రివేళల్లో చీకటి రాజ్యమేలుతోంది. పాదచారులు ప్రమాదాలతో గాయపడుతున్నారు.

### మున్సిపల్ శాఖ అధికారుల నిర్లక్ష్యం..

వీధి విద్యుత్ దీపాల నిర్వహణకు ప్రత్యేక బృందాలు, కాంట్రాక్టర్లు ఉన్నప్పటికీ వారు నెలల తరబడి ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంలేదు. ఫిర్యాదులు చేసినా అసలు స్పందన లేదు. ప్రతి జోన్లో ఉన్న ఇంజనీర్లు, సూపర్వైజర్లు తమ బాధ్యతలను పూర్తిగా విస్మరించారు. పౌరుల ఫిర్యాదులు 'అభయ్ హెల్ప్లైన్', 'మై జీహెచ్ఎంసీ యాప్' ద్వారా వెళ్లినా, చర్యలు మాత్రం శూన్యం, ఇక ట్విట్టర్ కు అధికారులు స్పందించే పరిస్థితి అసలే లేదు. రేవంత్ సర్కార్ పాలనలో ట్విట్టర్ అకౌంట్ ని అధికారులు అసలు వాడడం పూర్తిగా మానివేశారు. ఇక ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయి, ఎప్పుడు పరిష్కరిస్తారు.

### ప్రజల ఆవేదన..

"రోడ్డు మీద లైట్ లేకపోవడం వల్ల రాత్రిళ్లు బయటకు రావడానికి భయమేస్తుంది. పాత లైట్లు అయితే కనీసం వెలిగేవి. ఇవి కొత్త ఎల్ఈడీలు అని పేరు మాత్రమే." అని ఓ ద్విచక్ర వాహన దారుడు వెల్లడించాడు.

"మేము ఎన్నిసార్లు కంప్లైంట్ ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రతిసారీ సమాధానం ం 'తదుపరి వారంలో పని చేస్తాం' అంటారు."

ఉప్పల్ ప్రాంత ఓ నివాసి

### వెలుతురు లేని వీధులు చీకటి పాలన..

హైదరాబాద్ను "స్మార్ట్ సిటీ"గా తీర్చిదిద్దుతామన్న పాలకుల వాగ్దానాలు కేవలం మాటలకే పరిమితమయ్యాయి. వీధి విద్యుత్ దీపాలు వెలగకపోవడం, చీకటి వీధులు ప్రమాదాల వేదికగా మారడం, పౌరుల భద్రతను పణంగా పెట్టడం అధికారుల నిర్వాకాన్ని స్పష్టంగా చూపిస్తోంది. అయినా దీనిపై పాలకులు దృష్టి సారించకపోవడం ప్రజల దౌర్భాగ్యమే కదా.

### అవసరం శాశ్వత పర్యవేక్షణ..

ప్రతి వార్డులో విద్యుత్ దీపాల నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించి, 24 గంటల మానిటరింగ్ వ్యవస్థను అమలు చేయాలి. పాడైన లైట్ల మరమ్మత్తుకు టైమ్లిమిట్ విధించి, అజాగ్రత్త చూపే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి. ప్రజల క్షేమమే ప్రభుత్వం బాధ్యత. కానీ చీకట్లో నడుస్తున్న నగరం ం అది కాంతి కోల్పోయిన యంత్ర పాలనకు నిదర్శనం.

# వైట్ కోట్ టెర్రర్

## – వైద్య ముసుగులో ఉగ్ర కుట్ర




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నాలుగు ఘటనలు.. నాలుగు వేర్వేరు ప్రాంతాలు.. జరిగనవన్నీ వేరేనే. కానీ కామన్ పాయింట్ ఒకటి ఉంది. అదే డాక్టర్స్. దేశంలో అలజడులు సృష్టించటానికి ప్రయత్నిస్తున్న ఉగ్రముతాలు ఆపరేషన్ సిందూర్ తర్వాత వైట్ కోట్ క్రైమ్ కి దిగుతున్నాయా అన్న అనుమానాలు వస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో దేశవ్యాప్తంగా జరిగిన ఘటనలు డాట్స్ను కలిపితే క్లియర్ పిక్చర్ అర్థమవుతోంది. సమాజంలో గౌరవ వృత్తిలో ఉన్న వైద్యులను ఓ గ్రూప్గా ఏర్పరిచి పెద్ద ఎత్తున అలజడికి ప్రయత్నించినట్లు అర్థమవుతోంది. ఢిల్లీ పేలుళ్లకు మందు మూడు ప్రాంతాల్లో నలుగురు డాక్టర్లు టెర్రరిస్టు కార్యకలాపాలకు పాల్పడుతూ దొరికిపోవడం ఢిల్లీ పేలుడుకు కారణమైన వెహికిల్ ఓ డాక్టర్ది కావడం అందులో ఆయన కూడా ఉండటంతో మిగిలిన టెర్రరిస్టులకు ఇతనికి సంబంధాలున్నాయా అనుకున్నారు. ఇప్పుడు ఆ డాక్టర్ది కూడా మిగిలిన వారు ఉండే ప్రాంతమే కావడంతో అనుమానాలు బలపడుతున్నాయి. అసలేంటీ ఆ నాలుగు ఘటనలు వైద్య వృత్తిని అడ్డం పెట్టుకుని ప్లాన్ చేస్తున్న నరమేధానికి ఇవన్నీ సంకేతాలా అన్నది వివరాల్లోకి వెళ్తే..

### సీన్ 1- ఫరీదాబాద్, హర్యానా
### డేట్ : నవంబర్ 10, 2025

ఫరీదాబాద్ లోని దాహూజ్ అండ్ ఫతేపూర్ టాగా ప్రాంతాలను పోలీసులు చుట్టుముట్టారు. దేశంలో అతిపెద్ద కౌంటర్ టెర్రర్ ఆపరేషన్స్ లో ఒకటిగా భావిస్తున్న ఓ ఆపరేషన్ ను పోలీసులు సమర్థంగా నిర్వహించారు. జమ్ము కశ్మీర్ పోలీసులతో కలిసి ఫరీబాదాబ్ పోలీసులు చేపట్టిన ఈ ఆపరేషన్ లో ఇద్దరు డాక్టర్లు డా. ముజామిల్ షకీల్, డా. ఆదిల్ అహ్మద్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఇద్దరు డాక్టర్లది జమ్ముకశ్మీర్ లోని అనంత్ నాగ్ ప్రాంతం. వారి నుంచి 360 కిలోల అమ్మోనియం నైట్రేట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు ఏకే 47 తరహా రైఫిల్స్, పిస్టల్స్, బాంబ్ టైమర్స్ ఇతర పేలుడు పదార్థాలను మారణాయుధాలును స్వాధీనపరుచుకున్నారు. ఉత్తరప్రదేశ్ లోని సహరన్ పూర్ లో ఆదిల్ అహ్మద్ ను అరెస్ట్ చేయటంతో ఈ ఇద్దరు డాక్టర్ల ఉగ్రకుట్ర బయటపడింది. ఫలితంగా ఫరీదాబాద్ లీడ్ తెలిసింది. భారీ మొత్తంలో పేలుడు పదార్థం స్వాధీనమైంది.

### సీన్ 2 - లక్నో, ఉత్తర్ ప్రదేశ్
### డేట్ : నవంబర్ 10, 2025

సీన్ జరిగింది లక్నోలో. డా. షహీన్ షాహిద్ పేరున్న ఓ లేడీ డాక్టర్ ను పోలీసులు లక్నోలో అరెస్ట్ చేశారు. ఆమెనుంచి ఏకే 47 రైఫిల్ ను స్వాధీనం చేసుకున్నారు. అంతే కాదు కారులో చాలా క్యాట్రిడ్జ్ లు కూడా దొరికాయి. జమ్ము కశ్మీర్ నుంచి వచ్చి ఫరీదాబాద్ లో పేలుడు పదార్థాలతో దొరికిపోయిన ఇద్దరు డాక్టర్లకు ఈమెకు ఏదో లింక్ ఉంది అని పోలీసులు అనుమానిస్తున్నారు జమ్ము కశ్మీర్ డాక్టర్లను ఆపరేట్ చేస్తున్న సేమ్ నెట్ వర్కే ఈమెను కూడా ఆపరేట్ చేస్తోందని. కౌంటర్ టెర్రర్ ఆమెను అదుపులోకి తీసుకుని విచారిస్తోంది.

### సీన్ 3 - గుజరాత్ & హైదరాబాద్
### డేట్ : నవంబర్ 8, 2025


గుజరాత్ కు చెందిన ఏటీఎస్ అధికారులకు ఉగ్ర కదలికలకు సంబంధించిన ఓ లీడ్ దొరికింది. గుజరాత్ లోని అహ్మదాబాద్ ఇంకా మెహసానా ప్రాంతాలతో హైదరాబాద్ లో ఏకకాలంలో మెరుపు దాడులు చేశారు. హైదరాబాద్ కు చెందిన డా. అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ అనే డాక్టర్ పెద్ద మొత్తంలో ఆముదం గింజలతో రైసిన్ అనే ప్రమాదకరమైన రసాయనాన్ని తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ డాక్టర్ చైనాలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని హైదరాబాద్ బేస్డ్ గా తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఏటీసీ సోదాల్లో విదేశీ తుపాకులు, రైసిన్ తయారీ కోసం పెద్ద మొత్తంలో సేకరించిన ఆముదాన్ని గుర్తించారు. ఈ రైసిన్ ప్రపంచంలోనే అత్యంత విషపూరిత పదార్థాల్లో ఒకటి. క్షణాల్లో ప్రాణాలు తీయగలిగే శక్తి దీనికి ఉంది. తన హ్యాండ్లర్స్ నుంచి ఆయుధాలు సమకూర్చుకునేందుకు గుజరాత్ వచ్చిన సయ్యద్ను ఏటీఎస్ అరెస్ట్ చేసింది.

### సీన్ 4 - ఢిల్లీ కార్ బ్లాస్ట్
### డేట్ : నవంబర్ 10, 2025

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో కారు బ్లాస్ట్ అయ్యింది. చూస్తుండగానే 9 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మెట్రో స్టేషన్ కు అతి సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్ లో జరిగిన ఈ పేలుడులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఎర్రకోట సమీపంలోని ఓ మసీదు ప్రాంగణంలో పేలుడుకు గురైన కారు 3 గంటలు పాటు పార్క్ చేసి ఉంచినట్లు అధికారులు గుర్తించారు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతం నుంచి సాయంత్రం 6.20 వరకూ కారును పార్కింగ్ లోనే ఉంచి ఆ తర్వాత బయటకు తీసుకు వస్తున్న వ్యక్తి విజువల్స్ ను సీసీటీవీ ఫుటేజెస్ లో పోలీసులు గుర్తించారు. కారు నడపుతున్న వ్యక్తిని డా.మహ్మద్ ఉమర్ గా అని తేల్చారు. పేలుడు జరిగిన ప్రాంతంలో అమ్మోనియం నైట్రేట్ ట్రేసెస్ ఉన్నట్లు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. డిటోనేటర్లు కూడా గుర్తించినట్లు తెలుస్తోంది. అంటే ఇది ఆత్మాహుతి దాడిలా జరిగిందా అనే కోణంలో పరిశోధన చేస్తున్నారు. చనిపోయిన ఉమర్ కూడా అనంతనాగ్కు చెందిన వాడు డాక్టర్గా ఫరీదాబాద్లో పనిచేశాడు. అక్కడ అరెస్టు అయిన ఇద్దరు డాక్టర్లు కూడా అనంతనాగ్కు చెందిన వారు. దీంతో అనుమానాలు మరింత బలపజడుతున్నాయి. ఫరీదాబాద్ లో పట్టుబడిన డాక్టర్ల గురించి వార్తలు బయటకు వచ్చిన తర్వాత ఎర్రకోట్ల దగ్గర బ్లాస్ట్ కు ప్లాన్ చేశారా, ఏదైనా ఉగ్ర సంస్థ మొత్తం డాక్టర్లతో ఈ ఆపరేటింగ్ నెట్ వర్క్ ను మెయింటైన్ చేస్తోందా, నిజమైతే వాళ్ల ప్లాన్ ఏంటీ.? ఢిల్లీ బ్లాస్ట్ కోసమే ఇదంతా చేశారా లేదా మరేదైనా పెద్ద ప్లాన్ లో ఉన్నారా.? దీనంతటి కోసం పవిత్రమైన వైద్యవృత్తిని ఎంచుకుని ప్రాణాలు పోసే వైద్యులతోనే ప్రాణాలు తీయించే ప్లాన్ చేస్తున్నారా సంచలన విషయాలు మరికొద్ది రోజుల్లోనే నిగ్గు తేలనున్నాయి.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ

**- ఫలితాలపై భారీ స్థాయిలో బెట్టింగులు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తుండటం, అత్యధికంగా సెటిలర్ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కావడంతో ఈ ఉప ఎన్నికకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ఎన్నికల్లో 58 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ పోరు కనిపించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలపై భారీ స్థాయిలో బెట్టింగ్లు జరిగినట్లు సమాచారం. దాదాపు 500 కోట్ల రూపాయల వరకు బెట్టింగ్లు జరిగాయని తెలుస్తోంది. గెలుపుతో పాటు మెజార్టీపై కూడా బెట్టింగ్లు వేసినట్లు చెబుతున్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలపై కూడా పెద్ద ఎత్తున బెట్టింగ్ కాశారని సమాచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. ఆయా పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందే అవకాశాలు ఉన్నాయని ఎగ్జిట్ పోల్ సర్వేలు తెలుపుతున్నాయి.

# మా ప్రభుత్వ లక్ష్యానికి కీలక ముందడుగు

**– గతంలో పారిపోయిన పరిశ్రమలు, మళ్లీ ఏపీకి వస్తున్నాయన్న లోకేశ్**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్లో పారిశ్రామిక అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఈ పార్కులకు, 38 పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కనిగిరిలోని పెదఈర్లపాడులో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కుతో పాటు మిగిలిన వాటిని వర్చువల్గా ప్రారంభించారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో స్పందించారు. "ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యానికి నేడు ముందడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. 38 మెగా పరిశ్రమల్నీ సీఎం గారు ప్రారంభించారు. ఒక్క ఎంఎస్ఎంఈల ద్వారానే 5 లక్షల మంది యువతకు నేరుగా ఉద్యోగాలు లభిస్తాయి. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ముఖ్యమంత్రి గారి సంకల్పం ఈ ఎంఎస్ఎంఈల ద్వారా నెరవేరుతోంది. పరిశ్రమల ఏర్పాటుతో అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. గత పాలకుల వైఖరితో పరిశ్రమలు రాష్ట్రం నుంచి పారిపోతే మేం అధికారంలోకి వచ్చాక ఏపీకి చలో చలో అంటూ పెట్టుబడులతో ముందుకు వస్తున్నాయి" అంటూ మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

# ఓటు వేసిన అందరికీ ధన్యవాదాలు

**– శక్తివంచన లేకుండా పనిచేసిన కార్యకతలకు కృతజ్ఞతలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలింగ్ ముగిసిన అనంతరం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "గత నెల రోజులుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు. అధికార పార్టీ ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా, భయభ్రాంతులకు గురిచేసినా బయటకు వచ్చి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 58 మంది బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. ప్రధానంగా వీరి ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు కూడా వెలువడ్డాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588